





దసపల్లా హోటల్‌లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు, అభిమానులు

మూడు రాజధానులన్నారు ఒక్కటీ లేకుండా చేశారు

జగన్‌పై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజం

- ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రత్యేక హోదా కోసం మూకుమ్మడి రాజీనామాలు చేద్దామన్నారు
- ముఖ్యమంత్రి అయిన తరువాత ఆ విషయమే మరచిపోయారు
- కనీసం ఒక్కసారి కూడా కేంద్రాన్ని నిలదీయలేకపోయారు
- రాష్ట్ర ప్రయోజనాలను వైసీపీ... బీజేపీకి తాకట్టుపెడుతుందని మండిపాటు
- రాజన్న రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం
- కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి
- ప్రతి తలుపు తట్టండి... అధికారంలోకి వస్తే ఏం చేస్తామో వివరించండి
- నేతలు, కార్యకర్తలకు దిశా, నిర్దేశం



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న షర్మిల, నేతలు

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):

"మరికొద్ది రోజుల్లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా పనిచేయాల్సిన అవసరం ఉంది" అని నాయకులు, కార్యకర్తలకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. పీసీసీ పగ్గాలు చేపట్టిన తరువాత జిల్లాల పర్యటన ప్రారంభించిన ఆమె బుధవారం నగరంలోని దసపల్లా హోటల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార వైసీపీ, ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీపై విమర్శలు గుప్పించారు.

కాంగ్రెస్ పార్టీతోనే రాజన్న రాజ్యం సాధ్యమవుతుందని షర్మిల స్పష్టం అన్నారు. పేదలకు అండగా వుండే ప్రభుత్వం కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం వుందని, ఇందుకోసం ప్రతిఒక్కరూ కష్టప డాలన్నారు. ఇంటింటికీ వెళ్లి గతంలో కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలతోపాటు పార్టీ విధివిధానాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఇప్పుడున్న వైసీపీ ప్రభుత్వానికి, రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడాను తెలియజేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. తెలంగాణలో 20 శాతం ఉన్న ఓటు బ్యాంకు..ఎన్నికల నాటికి 40 శాతానికిపైగా చేరుకుని అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలోనూ అధికారంలోకి వస్తామని, కార్యకర్తలు బలంగా పనిచేయాలని సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని వివరించడంతోపాటు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలను అమలు చేస్తామన్న విషయాన్ని తెలియజేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలను మ్యానిఫెస్టోలో చేర్చుతామని ... మిగతా 6వ పేజీలో

పర్యాటక ప్రాజెక్టులు ప్రైవేటుపరం!

లీజుకు కట్టబెట్టాలని వైసీపీ ప్రభుత్వం నిర్ణయం

- విశాఖపట్నం, అరకులోయ, అనంతగిరి, లంబసింగి ప్రాంతాల్లో ఉన్న రిసార్టులు, హోటళ్లు అన్నీ కూడా...
- ప్రభుత్వ ఖజానాకు గండి
- ప్రస్తుతం ఏడాదికి రూ.28 కోట్లు ఆదాయం
- రూ.15 కోట్లకే ఇస్తామని టెండర్ల ఆహ్వానం
- అస్మదీయులకు అప్పగించేందుకు వైసీపీ సర్కారు పన్నాగం?



అప్పుఘర్ వద్ద ఏపీ టూరిజంకు చెందిన హరిత హోటల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక ఆస్తులన్నీ ప్రైవేటుకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాదికి సుమారు రూ.28 కోట్ల ఆదాయం ఇస్తున్న వాటిని కేవలం రూ.15 కోట్లకే ఇచ్చేస్తామని ప్రకటన జారీ చేసింది. పైగా ఆయా కేంద్రాల్లో పనిచేస్తున్న వారికి తామే జీతాలు ఇచ్చుకుంటామని, ప్రైవేటు పార్టీలకు సంబంధం లేదని చెబుతోంది. అంటే లీజు ద్వారా వచ్చే రూ.15 కోట్లలో రూ.8 కోట్లు జీతాలకు తీసేస్తే ప్రభుత్వానికి మిగిలేది రూ.7 కోట్లు మాత్రమే. ఎక్కడైనా నష్టాలను పూడ్చుకొని, లాభాలు పొందడానికి ప్రైవేటుకు అప్పగిస్తారు. కానీ ఇక్కడ రూ.28 కోట్ల ఆదాయాన్ని ఇచ్చే హోటళ్లు, రిసార్టులను రూ.15 కోట్లకే ఇచ్చేయడానికి నిర్ణయించారు. ఈ చర్యల ద్వారా ఏడాదికి రూ.13 కోట్ల నష్టం. ఇది టెండర్ దక్కించుకున్న వారికి లాభం. అధికార పార్టీకి అస్మదీయులైన వారికి లబ్ధి చేకూర్చడానికే ఎన్నికల ముందు ఈ నిర్ణయం తీసుకుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అరకులోయలో హిల్ రిసార్టు

విశాఖపట్నం జిల్లా అంటేనే పర్యాటకం. ఇక్కడికి రోజుకు సగటున 50 వేల మంది పర్యాటకులు వస్తుంటారు. వీరంతా వసతి కోసం పర్యాటక శాఖ నిర్మించిన రిసార్టులు, హోటళ్లనే మొదట కోరుకుంటారు. అక్కడ రూములు దొరక్కపోతేనే ప్రైవేటు హోటళ్లకు వెళతారు. విశాఖపట్నం, అరకులోయ, అనంతగిరి, లంబసింగి తదితర ప్రాంతాల్లో పర్యాటక శాఖ నిర్మించిన హోటళ్లు, రిసార్ట్‌ను ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) నిర్వహిస్తోంది. అంటే ఆస్తులు పర్యాటక శాఖవైతే...ఆపరేషన్, నిర్వహణ (ఓ అండ్ ఎం) అంతా ఏపీటీడీసీ చూస్తోంది. కొన్ని దశాబ్దాలుగా ఇదే జరుగుతోంది. ప్రభుత్వం కొత్తగా ఏపీటీడీసీ నిర్వహిస్తున్న వాటిని ప్రైవేటు సంస్థలకు దీర్ఘకాలిక లీజుకు ఇచ్చేయాలని నిర్ణయించింది. ఇప్పుడు వస్తున్న ఆదాయం కంటే ఎక్కువ వస్తుందని అంచనాలు ఏమైనా ఉంటే అందులో తప్పు లేదు. కానీ ఇక్కడ చేతికి నికరంగా వస్తున్న ఆదాయంలో 2/3వ వంతు తగ్గిపోతుందని తెలిసినా ఐదేళ్ల నుంచి 33 ఏళ్ల వరకు లీజుకు ఇవ్వడానికి నిర్ణయించారంటే...ఎవరికో ప్రత్యేకంగా లబ్ధి చేకూర్చడానికే అనేది చాలా సుస్పష్టం.

నోటిఫికేషన్‌లో ఏమున్నందంటే...?

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక ఆస్తులను లీజుకు ఇచ్చేయడానికి ప్రకటన ఇచ్చింది. అందులో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు సంబంధించి విశాఖపట్నంలోని అప్పుఘర్ వద్ద ఉన్న హరిత రిసార్ట్స్, అనంతగిరి మండలం టైడాలోని జంగిల్స్ బెల్స్, అనంతగిరి రిసార్ట్స్, లంబసింగిలోని రిసార్టులు ఒక ప్యాకేజీలో ఉన్నాయి. ఈ నాలుగింటికి కలిపి ఏడాదికి రూ.3.35 కోట్లు లీజుగా, అక్కడ వచ్చే ఆదాయంలో 24 శాతం వాటా ఇచ్చేలా ఒప్పందం కోసం ప్రభుత్వం ప్రైవేటు పార్టీలను ఆహ్వానించింది.

- అరకులోయలోని మయూరి రిసార్ట్స్, వేలీ రిసార్ట్‌లు కలిపి మరో ప్యాకేజీ కింద ప్రకటన ఇచ్చింది. ఈ రెండింటికి ఏడాదికి రూ.4 కోట్ల లీజు మొత్తం, వచ్చే ఆదాయంలో 24 శాతం వాటా ఇవ్వాలనే షరతు పెట్టింది.
- మొత్తం ఆరు రిసార్ట్‌లను రూ.7.35 కోట్లు (3.35 కోట్లు+4 కోట్లు) లీజుగా, వచ్చే ఆదాయంలో 24 శాతం వాటా ఇవ్వాల్సి ఉంటుంది

ఇదీ అక్కడ వచ్చే ఆదాయం

- విశాఖపట్నంలోని అప్పుఘర్ వద్ద హరిత రిసార్ట్‌లో 44 రూములు ఉన్నాయి. వీటి ఆధునికీకరణకు రూ.5 కోట్లతో పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. వీటి ద్వారా నెలకు సగటున రూ.40 లక్షల ఆదాయం వస్తోంది. అంటే ఏడాదికి రూ.4.8 కోట్లు. ఇక్కడ ... మిగతా 6వ పేజీలో



స్టాల్‌ను తిలకిస్తున్న కేంద్ర మంత్రి మురళీధరన్

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కేంద్ర పథకాలు

- కేంద్ర మంత్రి మురళీధరన్
- అర్హులకు అందేలా అధికారులు చూడాలి

మల్కాపురం, జనవరి 24: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి మురళీధరన్ అన్నారు. అయితే, ఆ వివరాలు అర్హులకు తెలియడం లేదని విచారం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరిట వీటిపై ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. నగరంలోని ములగాడ హౌసింగ్ కాలనీ జంక్షన్ సమీపంలో గల ఆళ్వార్‌దాస్ కళాశాల మైదానంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మురళీధరన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక సంక్షేమ పథకాలు అర్హులకు పూర్తిస్థాయిలో చేరడం లేదన్నారు. పథకాలు అట్టడుగు వర్గాలకు అందేలా అధికారులు కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి స్టాళ్లను ఏర్పాటుచేశారు. ఆ స్టాళ్లను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకలుగా ఓటర్ల జాబితాలు

- మూడు సార్లు ఫిర్యాదు చేసినా పట్టని యంత్రాంగం
- తొలగిస్తున్నామని సమాచారం పంపించి మరీ నిర్లక్ష్యం
- వైసీపీకి లబ్ధి చేకూర్చేందుకేనని మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆరోపణ

'నార్త్'లో బోగస్ ఓటర్లు కొనసాగింపు!



ఉత్తర నియోజకవర్గంలో 67 మంది ఓటర్లు ఉన్న ఇల్లు ఇదే..

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ఎన్నికల యంత్రాంగం స్పష్టమైన ఫిర్యాదులు అందినా స్పందించకుండా బోగస్ ఓటర్లను కొనసాగిస్తోంది. పరోక్షంగా అధికార పార్టీకి సహకారం అందిస్తోంది. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఒకే ఇంటి నంబరుపై 67 మంది ఓటర్లు ఉన్నారనే గతంలో విషయం బయటపడింది. మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సొంతంగా బృందాలను పెట్టుకొని నియోజకవర్గంలో ప్రత్యేకంగా సర్వే చేయించారు. ఈ క్రమంలో బూత్ నంబర్ 182, వార్డు నంబరు 14, బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని 49-54-8 నంబరు కలిగిన ఇంటికి శైలజా నాయర్ యజమాని. ఆ ఇంట్లో ఇద్దరు మాత్రమే నివాసం ఉంటున్నారు. కానీ ఆ ఇంటి నంబరుపై మొత్తం 67 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. ఈ విషయం గత ఏడాది మే నెలలో బయటపడింది. చుట్టుపక్కల ఉంటున్న మరో పది మంది పేర్లు కూడా ఇదే ఇంటి నంబరుతో ఉన్నట్టు గమనించారు. జూలై నెలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి విష్ణుకుమార్‌రాజు ఫిర్యాదు చేశారు. తప్పులు సరిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆ తరువాత అక్టోబరు నెలలో డ్రాఫ్ట్ ఓటర్ల ... మిగతా 6వ పేజీలో

'తూర్పు'లో డబుల్ ఎంట్రీలు

- ఒక్కొక్కరికీ రెండేసి ఓట్లు...చనిపోయిన వారి పేర్లు జాబితాలో తొలగించని వైనం

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):

ఓటర్ల తుది జాబితాలోనూ తప్పులు దొర్లాయి. విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఇసుకతోట ప్రాంతంలో బూత్ నంబర్ 261లో భారీగా డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. అంటే ఒక వ్యక్తికి రెండేసి ఓట్లు ఉన్నాయి. ఓటర్ల జాబితాలో వరుస సంఖ్య 405, 407 పేరుతో ముగడ చెల్లారావుకు రెండు ఓట్లు ఉన్నాయి. ఇసుకతోట ప్రాంతంలో ఇంటి నంబర్ 54-5-14లో ఉంటున్న చెల్లారావుకు ఐడీపై 3587151తో ఒక ఓటు, ఐడీపై 3587144తో మరో ఓటు ఉంది. ఇదే బూత్‌లో వరుస సంఖ్యలో 537, 539తో సంతోష్‌కుమార్ పల్లా అనే యువకుడికి రెండు ఓట్లు ఉన్నాయి. ఇంటి నంబరు 54-5-25లో ఉంటున్న సంతోష్‌కుమార్‌కు ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్ణయం

- జిల్లాలో 55 ఆస్పత్రులకు సుమారు రూ.80 కోట్ల వరకూ బకాయిలు

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులు గురువారం నుంచి సేవలు నిలిపివేసేందుకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం వేయి కోట్ల రూపాయలకుపైగా బకాయి ఉంది. ఈ మొత్తాన్ని డిసెంబరు 31లోగా చెల్లిస్తామని హామీ ఇచ్చింది. అయితే బకాయిలు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయాలని నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ నిర్ణయించింది. గురువారం ఉదయం నుంచి నెట్‌వర్క్ పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో కొత్తగా రిజిస్ట్రేషన్లు చేయబోమని ప్రకటించింది. పాత కేసులకు మాత్రం యథావిధిగా వైద్య సేవలు అందించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో 55 ఆస్పత్రులు ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రికి కనీసం రూ.కోటి నుంచి రూ.20 కోట్ల వరకు ప్రభుత్వం బకాయి ఉంది. ఆస్పత్రులన్నింటికీ కలిపితే సుమారు రూ.80 కోట్ల మేర రావలసి ఉంది. గడిచిన ఐదు నెలలు నుంచి బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. బకాయిలపై అదిగో, ఇదిగో అంటూ దాటవేస్తుండడంతో ఆస్పత్రులు సేవలు నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నాయి. ఈ విషయాన్ని రోగులు గుర్తించి తమకు సహకరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

జిల్లాలో యువ ఓటర్లు 38,265 మంది

- అత్యధికంగా భీమిలిలో 7,530 మంది,
- అత్యల్పంగా 'సౌత్'లో 3,279...

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో కొత్తగా 38,265 మంది యువతీయువకులు ఓటు నమోదు చేయించుకున్నారు. జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి యువకుడు/యువతి ఓటు నమోదు చేసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం పిలుపు నిచ్చింది. 2011 జనాభా లెక్కల మేరకు జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీయువకులు 99,735 మంది ఉంటారని అంచనా. అందులో 38,265 మంది మాత్రమే ఓటు నమోదు చేయించుకున్నారు. భీమిలిలో 7,530 మంది, విశాఖ తూర్పులో 5,377, దక్షిణలో 3,279, ఉత్తరంలో 4,746, పశ్చిమలో 4,357, గాజువాకలో 6,625, పెందుర్తి ... మిగతా 6వ పేజీలో

కనీస చర్చ లేకుండానే...

- జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో 53 అంశాలకు ఆమోదం
- అనవసర ప్రతిపాదనపైనా నోరు మెదపని సభ్యులు



మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన సమావేశమైన స్టాండింగ్ కమిటీ

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కనీస చర్చ లేకుండానే ఎజెండాలోని 53 అంశాలనూ సభ్యులు ఆమోదించేశారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారంజీ జరిగింది. ఈ సమావేశం కోసం ప్రధాన ఎజెండాలో పొందుపరిచిన 33 అంశాలతోపాటు టేబుల్ ఎజెండాగా 20 అంశాలను ప్రతిపాదించారు. వీటన్నింటినీ కార్యదర్శి కార్యాలయం సిబ్బంది కమిటీ సభ్యులకు చదివి వినిపించగా, ఒక్కరు కూడా అభ్యంతరం వ్యక్తంచేయకపోవడం, కనీసం చర్చ జరగకుండానే ఆమోదించేస్తున్నట్టు తలూపడం ఆశ్చర్యానికి గురిచేసింది. లీలామహల్ జంక్షన్ నుంచి చిత్రాలయ షాపింగ్ మాల్ వరకూ రోడ్డు బాగున్నప్పటికీ రూ.45.46 లక్షలు వెచ్చించి కొత్తగా రోడ్డు వేయాలనే ప్రతిపాదనతోపాటు కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు చెత్త తరలింపు కోసం ఇప్పటికే జోన్‌ల వారీగా ... మిగతా 6వ పేజీలో

కేవీలో చిత్రలేఖన పోటీలు

అక్కయ్యపాలెం, జనవరి 24: తాటిచెట్లపాలెంలోని పీఎంసీ కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన పరీక్ష పే చర్చ- 2024పై చిత్రలేఖన పోటీలను బుధవారం ప్రిన్సిపాల్ కమల్‌జిత్ ప్రారంభించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన వందమంది విద్యార్థులుపాల్గొన్నారు.న్యాయనిర్ణేతలుగావిద్యావేత్త విజయ,విశ్రాంతచిత్రకళ ఉపాధ్యాయుడు కె.సుబ్బారావు, ఉపాధ్యాయుడు విశ్వజిత్ వ్యవహరించారు.

బీసీసీఐ కార్యదర్శికి ఆహ్వానం



జై షాను ఆహ్వానిస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 24: ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో వేదికగా రెండో తేదీ నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య టెస్ట్ మ్యాచ్ ప్రత్యక్ష వీక్షణకు భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి జై షాను ఆహ్వానించినట్టు ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన బీసీసీఐ వార్షిక అ వార్డు కార్యక్రమానికి హాజరైన కార్యదర్శి జై షాను ఏసీఏ అధ్య క్షుడు శరత్ చంద్రరెడ్డితో కలిసినట్టు చెప్పారు. టెస్ట్ మ్యాచ్‌కు ఆహ్వానించామన్నారు.

30 మంది ఎస్‌ఐలకు పదోన్నతి

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్ పరిధిలో 2009 బ్యాచ్‌కు చెందిన 30 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ రేంజ్ ఐజీ హరికృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. బూరాడ అప్పలనాయుడు, దుంపల దీనబంధు, ఎస్.సన్యాసినాయుడులను అనకాపల్లి జిల్లాకు, లొద్ద రామకృష్ణ, ఎస్.సోమరాజులను విశాఖ సిటీ, కింతలి నారాయణ రావు, ముదిలి శ్రీనివాసరావు, జి.బాలకృష్ణను విజయనగరం పీటీసీ కళాశాలకు, చింతాడ ప్రసాద్, వి.రమేష్, ఎస్.లక్ష్మణరావు, జి.శ్రీనివాసరావును శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. కె.మల్లేశ్వరరావు, వి.శంకర నారాయణ, కె.జీవనకాంత్, టి.క్రాంతికుమార్, బి.లక్ష్మణరావు, వి.రామా రావు, వి.నారాయణ మూర్తిలను ఇంటెలిజెన్స్‌కు, వి.నాగరాజు, జి.అర్జున, జి.మల్లేశ్వరి, బి.మంగరాజులను సీఐడీకు, ఎ.ప్రసాదరావును మెరైన్ విభాగానికి, బి.అప్పలనాయుడు, కె.కామేశ్వరావులను రైల్వేస్, ఎం.శ్రీనును ట్రాన్స్‌కో, ఎం.చిన్నంనాయుడును ఏసీబీకి కేటాయించారు.

రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోంది: టీడీపీ

డాబాగార్డెన్స్ , జనవరి 24: అంగన్‌వాడీలపై పోలీసుల దమనకాండ దారుణమని టీడీపీ నాయకులు అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ చోడవరం పరిశీలకులు వీవీఎస్ మూర్తియాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతుందని ఆరోపించారు. టీడీపీ హయాంలో బీసీ, ఎస్సీఎస్టీలకు ప్రాధాన్యం లభించిందన్నారు. రాష్ట్రంలోని లాండ్ , శాండ్, వైన్ దోపిడీ సాగుతోందన్నారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ , మాజీ ప్రధాన కార్యదర్శి పాండ్రంగి జయరాజు,పెంటకోటశ్రీనాథ్, చిన్నాయాదవ్, సూర్యప్రకాష్, అప్పలరాజు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

» విశాఖ డీటీసీ రాజారత్నం



సమావేశంలో ఆర్టీఏ కార్యాలయ ప్రతినిధులు

మురళీనగర్, జనవరి 24 ; వాహనం నడిపే సమయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ప్రమాదాలు నివారించాలని విశాఖ డీటీసీ జి.సి. రాజారత్నం సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం లారీ ఆపరేటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ భాగస్వామ్యంతో వైద్యశిబిరం, అవగాహన శిబిరం నిర్వహించారు. డీటీసీ మాట్లాడుతూ, వాహనం నడిపే సమయంలో మాట్లాడుతుండంతో బైకులు, లారీలు ప్రమాదాలు జరుగుతున్నట్టు చెప్పారు. ఆటోలు ఈ రకమైన ప్రమాదాల్లో మూడో స్థానంలో ఉన్నట్టు గణాంకాల వారీగా వివరించారు. మద్యం సేవించి ఎట్టిపరిస్థితుల్లో వాహనాలు నడపరాదన్నారు. డ్రైవింగ్ వృత్తిలో క్రమ శిక్షణతో ఉంటూ ఆరోగ్యాలను కాపాడుకోవడం ద్వారా కుటుంబాలకు మెరుగైన భవిష్యత్తు ఇవ్వాలని అన్నారు. బీపీ, షుగర్, కంటి సమస్యలపై ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వాహనాలను కండిషన్‌లో ఉంచడం ద్వారా రోడ్డు ప్రమాదాల్ని నివారించవచ్చని సూచించారు. ఈ సమావేశంలో ఆర్టీఓ ఆర్సీహెచ్ శ్రీనివాస్, విశాఖ లారీ ఆపరేటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు బాపిరాజు, వ్యవస్థాపక సభ్యులు కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు సాయమందించాలి: ఎస్‌ఐ

సీతంపేట: రోడ్డు ప్రమాదాల సమయంలో క్షతగ్రతులకు సహాయం అందించడంతోపాటు పోలీసులకు సమాచారమందించాలని ద్వారకా పోలీసు స్టేషన్ ఎస్‌ఐ ఎన్ భాస్కరరావు కోరారు. గురుద్వార కూడలిలోని ఆటో స్టాండ్‌లో డ్రైవర్స్‌తో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగ్గా లైసెన్స్, ఆటోకి ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగినప్పుడు క్షతగ్రతులు ప్రాణాపాయ స్థితిలో ఉంటే వారిని ఆసుపత్రిలో చేర్పించాలని, మాదక ద్రవ్యాలు తరలిస్తున్నట్టు తెలిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు.

జనసేన పార్టీలో చేరికలు



జనసేనలో చేరిన నాయకులు, కార్యకర్తలు

అక్కయ్యపాలెం, జనవరి 24: గ్రేటర్ 42వ వార్డులో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సండపర్తి వెంకట త్రినాద్ మూర్తి, అలాగే మరో 300 మంది జనసేన పార్టీలో చేరారు. ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్, నార్త్ ఇన్‌చార్జి ఉషాకిరణ్ జనసేన కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సంకు వెంకటేశ్వరరావు, వసంత లక్ష్మి, కందుల నాగరాజు, శివప్రసాద్ రెడ్డి, ముమ్మిడి నాగమణి, శ్రీధర్, దివాకర్, అప్పారావు కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. కోట్లతో వసతుల కల్పన: మేయర్

అక్కయ్యపాలెం, జనవరి 24: నగర వాసులకు మౌలిక వసతుల కల్పనకు రూ. కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్టు మేయర్ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. గ్రేటర్ 26వ వార్డు శాంతిపురంలో రూ.29.70 లక్షల వ్యయంతో బీటీ రోడ్లతోపాటు, పలు అభివృద్ధి నిర్మాణ పనులకు బుధవారం రాష్ట్ర నెడ్‌క్యాప్ ఛైర్మన్ కేకే రాజు, మేయర్ శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ డీఈ శ్రీనివాసరావు, ఏఈ నిహారిక, వైసీపీ నాయకులు బొడ్డేటి కిరణ్, పాండవ శ్రీను, అమ్మాజి పాల్గొన్నారు.

మత సామరస్యంతో శాంతిస్థాపన

» గాంధీ సెంటర్ అధ్యక్షులు ఆచార్య బాలమోహన్‌దాస్



పోస్టర్‌ని ప్రదర్శిస్తున్న అతిథులు, నిర్వాహకులు

సీతమ్మధార, జనవరి 24: సర్వ మతాలు ఐక్యంగా ఉంటేనే శాంతి స్థాపన సాధ్యమని గాంధీ సెంటర్ అధ్యక్షులు ఆచార్య బాలమోహన్‌దాస్ పేర్కొన్నారు. డాక్టర్ బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాలులో గాంధీ సెంటర్, బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్ నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియన్ ఫ్రీడమ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 'మహాత్మాగాంధీ మత సామరస్యం' అనే అంశంపై చర్చగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా సభికులతో శాంతిపై ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ, దేశభక్తి, కులం, మతం అనేవి పూర్తి వ్యక్తిగత విషయాలన్నారు. అన్ని మతాల వారు కలిసి జీవించడం భారత దేశ సంస్కృతి అని అన్నారు. హైదరాబాద్‌కు చెందిన విజయ విహారం ఎడిటర్ రమణమూర్తి మాట్లాడుతూ, అంతా కలిసి జీవించడం భారత వారసత్వమని, గాంధీ బోధనలు విలువలు, తగిన ప్రాధాన్యం కల్పించలేకపోతున్నామని ఆయన విచారం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో సంస్థ ఛైర్మన్ నరవ ప్రకాశరావు, డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానులన్నారు, ఒక్కటీ లేకుండా చేశారు

... 5వ పేజీ తరువాయి

షర్మిల స్పష్టం చేశారు. విభజన హామీల అమలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ, టీడీపీలు బీజేపీతో కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. వైసీపీ రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెడుతోందని ఆరోపించారు. బీజేపీతో వైసీపీ కంటికి కనిపించని పొత్తు పెట్టుకుందన్నారు. వైసీపీ పాలనా వైఫల్యాలను ప్రజలు దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడడం ఖాయమన్నారు.

జగనన్న గారు మరచిపోయారా...?

ప్రత్యేక హోదా సాధన కోసం తెలుగుదేశం, వైసీపీ ఎంపీలంతా కలిసి మూకుమ్మడిగా రాజీనామాలు చేద్దామని జగనన్న గారు గత ఎన్నికల ముందు చెప్పి మరచిపోయారని షర్మిల ఎద్దేవా చేశారు. ఆయన సీఎం అయిన తరువాత ప్రత్యేక హోదా గురించి ఒక్కసారి కూడా నోరు విప్పలేదని విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం ఉద్యమం చేయకపోగా కనీసం మాట వరుసకైనా కేంద్రాన్ని నిలదీయలేదన్నారు. ప్రత్యేక హోదా పూర్తిగా మూలకు చేరగా, కనీసం ప్రత్యేక ప్యాకేజీ కూడా సాధించలేదని పరిస్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. పోలవరానికి 90 శాతం నిధులు ఇస్తామన్న కేంద్రం...తన మాట నిలుపుకోలేదన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయ్యిందని, చంద్రబాబునాయుడు ఒక రాజధాని అంటే...జగనన్న గారు మూడు రాజధానులన్నారని, తీరా చూస్తే రాష్ట్రానికి ఒక్క రాజధానే లేకుండాపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు పార్టీ నాయకులు, వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధుల నుంచి ఆమె సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులతో షర్మిల మాట్లాడారు. మత్స్యకార నాయకుడు జగన్ మాట్లాడుతూ మత్స్యకారులకు సబ్సిడీపై డీజిల్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిపరమైన సహాయం లేకపోవడంతో చాలామంది వలస వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మత్స్యకారులను ఆదుకుంటామని ఈ సందర్భంగా షర్మిల భరోసా ఇచ్చారు. దక్షిణ నియోజకవర్గానికి చెందిన దార్ల శ్రీనుతోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ హయాంలో చెత్త పన్ను వేశారని, ఇంటి పన్ను ఇష్టానుసారం పెంచారని చెప్పారు. భారత్ బచావో స్వచ్ఛంద సంస్థ సభ్యుడు ఎస్ఆర్ వేమన మాట్లాడుతూ బీజేపీని ఓడించేందుకు ముందుకు వచ్చే శక్తులతో కలిసి పనిచేస్తామన్నారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి బీజేపీ రాజ్యాంగాన్ని అమలు చేసే ప్రమాదముందన్నారు. సమావేశంలో కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, సీనియర్ నాయకులు కొప్పుల రాజు, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, పార్టీ ఉత్తరాంధ్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, నగర పార్టీ ప్రెసిడెంట్ గంపా గోవింద్, నాయకులు వజ్జపర్తి శ్రీనివాసరావు, చోడదాసి సుధాకర్, మూల వెంకటరావు, గుత్తుల శ్రీనివాస్, జగన్ మురారి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో పలువురు చేరిక

షర్మిల సమక్షంలో పలువురు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి షర్మిల ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఏపీటీఎస్ (ఏపీ టెక్నాలజీ సర్వీసెస్) మాజీ ఛైర్మన్ కొయ్య ప్రసాదరెడ్డి, హాసిని గ్రూపు అధినేత హాసిని, వైసీపీ నాయకులు ఏవీ వర్మ, బట్ట స్వర్ణ, టీవీ సీరియల్ నటి సరస్వతి, దార్ల శ్రీను, తలారి సురేష్, ఐ.అప్పలరాజు, బ్రహ్మస్వరూప్, కె.రామారావు, సీజీఎస్ సత్యం, స్వరూప్‌తోపాటు వంద మందికిపైగా నాయకులు, కార్యకర్తలు షర్మిల సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి షర్మిల కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.





వైసీపీ అక్రమాలపై షర్మిలకు బీవీ రామ్ వినతి

సాగర్‌నగర్, జనవరి 24 : వైసీపీ ప్రభుత్వం అక్రమాలు, అరాచకాలపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ వినతిపత్రం అందించారు. బుధవారం ఆయన దసపల్లా హోటల్‌లో షర్మిలను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రామ్ విలేకరులతో మాట్లాడుతూ జగన్‌కు ఒక్క చాన్స్ ఇచ్చినందుకు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారన్నారు. వైసీపీ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. ఇదే విషయమై షర్మిలతో చర్చించినట్టు తెలిపారు. జగన్ ఒక మానసిక రోగి అని, అతని గురించి షర్మిలకే ఎక్కువగా తెలిసి ఉంటుందన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. 27న జరిగే ముఖ్యమంత్రి బహిరంగ సభకు ముందుగానే అభివృద్ధిపై చర్చించేందుకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమైనా ముఖ్యమంత్రిలో ఇప్పటివరకు చలనం లేదన్నారు. మద్యపాన నిషేధం అమలు ఏమైందని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణలో వైసీపీ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు డాక్టర్ పప్పూర్‌నికుంజ్, వెంకటేశ్వరరావు ఉన్నారు.

వైసీపీ 'దక్షిణ'లో అదే తీరు

» సమన్వయకర్త వైవీ సమావేశానికి వార్డు అధ్యక్షులు డుమ్మా

» ముగ్గురు కార్పొరేటర్లు మాత్రమే హాజరు

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలో వైసీపీ నేతల మధ్య విభేదాలు పరిష్కారమయ్యేలా కనిపించడం లేదు. ఎండాడ పార్టీ కార్యాలయంలో ఆపార్టీ ఉమ్మడి విశాఖ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశానికి దక్షిణనియోజకవర్గంలోని కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు డుమ్మా కొట్టారు. ఈనెల 27న భీమిలి మండలంలో జరిగే పార్టీ ఉత్తరాంధ్ర స్థాయిస మన్వయ సదస్సు జనసమీకరణకు నియోజకవర్గాల వారీగా ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణం నేతల స్పందనచూసి సుబ్బారెడ్డితోపాటు ఇతర నేతలు కంగుతిన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లితోపాటు కార్పొరేటర్లు తోటపద్మావతి, అప్పలకొండ, కోడిగుడ్ల పూర్ణిమ మాత్రమే హాజరయ్యారు. వార్డు అధ్యక్షులు, నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారిలో ఒకరిద్దరు మాత్రమే కనిపించడంతో సుబ్బారెడ్డి దీనిపై నేతలవద్ద ఆరాతీసినట్టు తెలిసింది. ఎన్నికలకు రెండు నెలలు గడువుమాత్రమే ఉందని, ఈసమయంలో నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితి ఉంటే ఎలాగంటూ అసంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. ఎన్నిసార్లు సమావేశం ఏర్పాటుచేసినా ఇదేస్థితి ఉండడంపై అసహనం వ్యక్తంచేసినట్టు సమాచారం. నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారు, పార్టీఅనుబంధ సంఘాల నేతలనుకలుపుకుని వెళ్లాలని వాసుపల్లికి సూచించినట్టు తెలిసింది.

'జర్నలిస్టులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

మహారాణిపేట, జనవరి 24:జర్నలిస్టులకు ఉచితంగా లేదా నామమాత్ర ధరకే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కోరారు. మంగళవారంకలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కె ఎస్ విశ్వనాథన్‌ను కలసి వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల జీవోలో 40, 60 శాతం నిష్పత్తి ద్వారా ధర ని ర్ణయాన్ని సవరించాలన్నారు. లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సత్యనారా యణ, కె చంద్రమోహన్, బందరు శివ ప్రసాద్, అబ్బాస్, వి. శ్రీధర్, ఎం శ్రీహరి పాల్గొన్నారు.

సెమిస్టర్స్‌లో కెమికల్ విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణత



ఉత్తీర్ణులైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కె.వి.రమణ,అధ్యాపకులు

కంచరపాలెం, జనవరి 24: స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమో ఏడో సెమిస్టర్ విద్యార్థులు రికార్డుస్థాయిలో ఉత్తీర్ణత సాధించారు. గత డిసెంబర్‌లో జరిగిన సెమిస్టర్ పరీక్షలో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. గత 50ఏళ్లతఈ కళాశాల రికార్డులో శతశాతం ఉత్తీర్ణత సాధించడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్‌లో జరిగిన పరీక్షలో ఏడో సెమిస్టర్ నుంచి 61 విద్యార్థులు హాజరుకాగా, మొత్తం ఉత్తీర్ణులయ్యారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ బుధవారం కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు శతశాతం విద్యార్థులు ఉత్తీర్ణులుకావడం అధ్యాపకుల శ్రమ, గొప్పతనం ఉందని కొనియాడారు.సీనియర్ అధ్యాపకులు బీవీ లక్ష్మణరావు, ఎం.విజయలక్ష్మి, బీ హేమేంద్ర ప్రదీప్‌కుమార్, ఎల్ గీతిక పాల్గొన్నారు.

'కళింగ కోమట్లకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి'



షర్మిలకు వినతి పత్రం అందజేస్తున్న కిశోర్

మహారాణిపేట, జనవరి 24: ఉత్తరాంధ్ర కళింగ కోమట్లకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ కళింగ కోమట్ల సం క్షేమ అధ్యక్షుడు లాడి కిశోర్ కుమార్ కోరారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిలను కలిసి ఈమేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ య న మాట్లాడుతూ, కళింగ కోమట్లు ఉత్తరాం ధ్రలోని 30 నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపు ను ప్రభావం చేసే స్థితిలో ఉన్నారన్నారు. అయి నా, ఏ రాజకీయ పార్టీ తమకు గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థితిలో కళింగకోమట్లు ప్రజా ప్రతినిధులుగా పోటీ చేసే అవకాశం కల్పించాలని ఆమెను కోరినట్లు చెప్పారు.

కనీస చర్చ లేకుండానే...

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టు ఇచ్చిన అధికారులు, ఇప్పుడు అదనంగా రూ.33.83 లక్షలు వెచ్చించి అద్దె ప్రాతిపదికన లారీలను సమకూర్చుకోవాలనే ప్రతిపాదనపై కూడా సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేయకపోవడం విశేషం. ఈ సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతోపాటు కార్యదర్శి నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో యువ ఓటర్లు 38,265 మంది

... 5వ పేజీ తరువాయి

నియోజక వర్గంలో 6,350 మంది ఓటర్లుగా చేరారు. ఓటు నమోదుపై కళాశాలలు, వర్సిటీల్లో ప్రచారం చేసినా సగానికి పైగా యువతీయువకులు ఆసక్తి చూపలేదు. తుది ఓటర్ల జాబితా విడుదలైనా...యువతీయువకులు ఓటు నమోదు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా అధికారులు కోరుతున్నారు.

పర్యాటక ప్రాజెక్టులు ప్రైవేటుపరం!

... 5వ పేజీ తరువాయి

ఏపీటీడీసీ 40 మంది సిబ్బందిని ఉపయోగించుకుంటోంది. వారికి జీతాలు చెల్లిస్తోంది.

- అనంతగిరి మండలం తైడా జంగిల్ బెల్స్‌లో 23 రూములు ఉండగా వాటిలో 13 ఆపరేషన్‌లో ఉన్నాయి. అక్కడ నెలకు రూ.25 లక్షల ఆదాయం వస్తోంది. అంటే ఏడాదికి రూ.3 కోట్లు. అక్కడ 25 మంది పనిచేస్తున్నారు.
- అనంతగిరిలో 28 రూములు ఉండగా నెలకు రూ.40 లక్షల ఆదాయం వస్తోంది. ఏడాదికి రూ.4.8 కోట్లు. ఇక్కడ 30 మంది పనిచేస్తున్నారు.
- అరకులోని మయూరి రిసార్ట్‌లో 85 రూములు ఉన్నాయి. నెలకు రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. ఏడాదికి రూ.7.2 కోట్లు. అక్కడ 60 మంది పనిచేస్తున్నారు.
- అరకులోయ వేలీ రిసార్ట్‌లో 45 రూములు ఉన్నాయి. నెలకు రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. అక్కడ కూడా 60 మంది పనిచేస్తున్నారు.
- లంబసింగిలో 15 టెంట్ రూములు ఉన్నాయి. సీజన్‌లో నెలకు రూ.15 లక్షల ఆదాయం వస్తోంది. మొత్తం చూసుకుంటే ఏడాదికి కోటి రూపాయలు వస్తుంది. ఇక్కడ 15 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

..ఈ లెక్కన చూసుకుంటే వీటన్నింటి ద్వారా ఏడాదికి రూ.28 కోట్ల ఆదాయం వస్తోంది. సిబ్బంది జీతాలకు రూ.8 కోట్లు తీసేస్తే నికరంగా రూ.23 కోట్ల ఆదాయం ఏటీడీసీకి మిగులుతోంది. ఇప్పుడు ఇంతకు మించిన ఆదాయం రావాలి. కానీ ప్రభుత్వం టెండర్ ప్రకారం లీజు ద్వారా రూ.7.35 కోట్లు, ఆదాయంలో 24 శాతం (రూ.28 కోట్లలో నాలుగో వంతు) రూ.7 కోట్లు కలిపి సుమారు రూ.15 కోట్లు ఇస్తే చాలని నిబంధనలు పెట్టింది. ఇది కారుచౌక బేరం. ప్రభుత్వ నిర్వహణ కంటే ప్రైవేటు నిర్వహణ బాగుంటుంది కాబట్టి ఇంకా ఎక్కువ ఆదాయం వస్తుంది. వైసీపీకి చెందిన వారికి పర్యాటక ప్రాజెక్టులన్నీ కట్టబెట్టడానికే ఈ ప్రకటన ఇచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రేవుపోలవరం, అనంతగిరి కాఫీ హౌస్ కూడా

అనకాపల్లి జిల్లాలోని రేవుపోలవరం బీచ్‌లో షాక్స్ పేరుతో మూడు రెస్టారెంట్లు ఉన్నాయి. వాటిని కూడా లీజుకు ఇచ్చేస్తామని ప్రకటించారు. ఏడాదికి రూ.7.85 లక్షల అద్దె, వచ్చే ఆదాయంలో 10 శాతం వాటా ఇస్తే...18 ఏళ్లకు లీజుకు ఇస్తామని నోటిఫికేషన్ ఇచ్చారు. అలాగే అనంతగిరిలో కాఫీకి సంబంధించి రీసెర్చ్ డెవలప్‌మెంట్ భవనం ఉంది. దానిని 'కాఫీ హౌస్'గా వ్యవహరిస్తారు. దానిని కూడా ఏడాదికి రూ.1.1 లక్షలకు లీజు నిర్ణయించారు. వచ్చే ఆదాయంలో 10 శాతం అదనంగా ఇస్తే నాలుగేళ్ల లీజుకు ఇస్తామని ప్రకటించారు.

విశాఖలో పీపీపీలో ఫైవ్ స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం

విశాఖపట్నంలో 5 స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్‌ను పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో నిర్మించి, నిర్వహించడానికి కూడా టెండర్ పిలిచారు. వాస్తవానికి రుషికొండపై ఫైవ్ స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ రూ.450 కోట్లతో సీఎం క్యాంపు కార్యాలయం మాత్రమే నిర్మించారు. హోటల్, కన్వెన్షన్ సెంటర్లు లేవు. ఇప్పుడు పీపీపీలో నిర్మించడానికి టెండర్లు ఆహ్వానించారు. అయితే అది రుషికొండపైనా, సాగర్‌నగర్‌లో ఉన్న 3 ఎకరాల్లోనా అనేది ప్రకటించలేదు. అయితే ప్రాజెక్టు నిర్మించేందుకు ఇచ్చే భూమికి సబ్ రిజిస్ట్రార్ విలువలో ఒక శాతం లీజుగా, 4 శాతం డెవలప్‌మెంట్ ఫీజుగా, ఆదాయంలో మరో 4 శాతం వాటాగా ఇవ్వాల్సి ఉంటుందని నిబంధన పెట్టారు. ఇలా ఎవరైనా ముందుకువస్తే వారికి 33 ఏళ్లకు లీజు ఇస్తామని ప్రకటించారు.

తప్పుల తడకలుగా ఓటర్ల జాబితాలు

... 5వ పేజీ తరువాయి

జాబితా విడుదల చేశారు. అందులో ఆ పేర్లు అదే ఇంటి నంబరులో ఉన్నాయి. తొలగించలేదు. దాంతో విష్ణుకుమార్‌రాజు నవంబరు 16న నేరుగా జిల్లా రిటర్నింగ్ అధికారి అయిన కలెక్టర్ మల్లికార్జునను కలిసి ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై ఆయన ఢిల్లీలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు కూడా డిసెంబరు 14న ఫిర్యాదు చేశారు. ఆయన కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఐదు మాత్రమే తొలగించారు: విష్ణుకుమార్‌రాజు

అయితే తాజాగా ఓటర్ల జాబితాలో చూడగా ఆ ఇంటి నంబరుపై 67 ఓట్లలో కేవలం ఐదు మాత్రమే తొలగించారని, మరో పది మంది పేర్లు వారి ఇంటి నంబర్లకు కలిపారని, ఇంకా 50 మంది బోగస్ ఓటర్లు ఉండగా వారికి ఇంటి నంబర్లు 49-54-8 నుంచి ఈఆర్ 1, ఈఆర్ 2...అంటూ సీరియల్‌గా ఇచ్చేసి అలాగే కొనసాగించారని విష్ణుకుమార్‌రాజు ఆరోపించారు. స్థానికంగా లేనివారిని ఇక్కడ ఓటర్లుగా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఇలా అధికార పార్టీ వైసీపీ అడ్డదారిలో ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దీనిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'తూర్పు'లో డబుల్ ఎంట్రీలు

... 5వ పేజీ తరువాయి

ఐడీపై 1436055, ఐడీపై 2735041 నంబర్లతో ఓటు హక్కు కల్పించారు. ఇదే బూత్ శివాలయం వీధిలో ఇంటినంబరు 54-6-5లో ఉంటున్న పెంటకోట దివ్యకు రెండు ఓట్లు (వరుస సంఖ్య 620, 621...ఐడీపై 3560570, ఐడీపై 3555414) ఉన్నాయి. ఇంకా రాపేటి చరణ్‌కు (వరుస సంఖ్య 602, 603) రెండు ఓట్లు ఉన్నాయి. కాగా పాత ఆరిలోవ ప్రాంతంలో 11వ వార్డులో బూత్ నంబర్ 30 పరిధిలోని ఇంటి నంబరు 13-1441లో నివాసం ఉంటున్న వి.ధనలక్ష్మి మృతి చెందినా ఆమె ఓటు జాబితా నుంచి తొలగించలేదు. ఇదే బూత్‌లో మృతిచెందిన సప్ప మల్లేశు ఓటు అలాగే ఉంది. ఇదే బూత్‌లో ఇంటి నంబరు 13-1440లో ఉంటున్న బొట్టా చిట్టెమ్మకు 603, 605 నంబర్లుతో రెండు ఓట్లు ఉన్నాయి.

విదేశీ పర్యాటకునిపై గుర్తు తెలియని యువకుల దాడి



గాయపడిన విదేశీయుడు

గాజువాక, జనవరి 24: విదేశీ పర్యాటకునిపై దాడి చేసి సెల్ ఫోన్ ఎత్తుకుపోయిన సంఘటన యారాడబీచ్‌లో బుధవారం చోటుచేసుకుంది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి.. స్విట్జర్లాండ్‌కు చెందిన నోహ ఎల్లియస్ అనే యువకుడు టూరిస్టు వీసాపై ఇండియా వచ్చి పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఎల్లియస్ యారాడ బీచ్‌కు వచ్చి కొండపై ట్రెక్కింగ్ చేస్తున్నాడు. ఈ సమయంలో ముగ్గురు గుర్తు తెలియని యువకులు వచ్చి ఆయనపై దాడి చేసి విలువైన సెల్ ఫోన్‌ను ఎత్తుకుపోయారు. గమనించిన పలువురు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్నిఏడీసీపీ గంగాధర్, హార్బర్ ఏసీపీ మోసెస్ రాజు, సీఐ ఎర్రన్నా యుడు పరిశీలించారు. కాగా ముగ్గురు యువకుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మిగిలిన ఇద్దరు కోసం గాలిస్తున్నారు.



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న షర్మిల



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం నగరంలో పర్యటించారు. దసపల్లా హోటల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురికి కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం స్టీల్ ప్లాంట్ వద్ద కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తూ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని హామీ ఇచ్చారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



..మాట్లాడుతున్న కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు

ఎమ్మెల్యే గంటా రాజీనామా ఆమోదం వెనుక వైసీపీ కుట్ర

కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జనవరి 24: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు, నిర్వాసితులు చేస్తున్న పోరాటాలకు మద్దతుగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రెండేళ్ల కిందట రాజీనామా చేస్తే ఇప్పుడు ఆమోదించడం వెనక వైసీపీ ప్రభుత్వ కుట్ర దాగి ఉందని 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యసభ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు గంటా శ్రీనివాసరావు రాజీనామాను ఆమోదించారన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో వైసీపీ ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తుందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, అప్పారావు, సింహాచలం, సోమినాయుడు, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ-జనసేన కలయికతో ప్రజలకు మేలు'

గాజువాక, జనవరి 24: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడితేనే ప్రజలకు మేలు జరుగుతుందని టీఎన్‌టీయూసీ స్టీల్ ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి అన్నారు. 73వ వార్డులో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాలు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

అగనంపూడి, జనవరి 24: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థానిక బ్రాంచి మేనేజర్ ఎస్.సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక అభివృద్ధి కమిటీ ఖాతాదారుల సమస్యలపై ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను బీఎంకు వివరించారు. ముఖ్యంగా బ్యాంకు వద్ద సెక్యూరిటీని తొలగించారని, ఖాతాదారులకు రక్షణగా సెక్యూరిటీని నియమించాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకంలో వృత్తి పనులు చేసేవారికి రుణాలను అందజేయాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఇప్పటివరకు విశ్వకర్మ పథకం కింద 450 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి అర్హులకు రుణాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు బి.సత్యనారాయణ, తలారి వెంకటరమణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చంద్రనగర్‌లో తీర్థ మహోత్సవం

గోపాలపట్నం, జనవరి 24 : స్థానిక చంద్రనగర్‌లో కొలువైన సీతారాముల ఆలయ తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముందుగా ఉత్సమూర్తులను అలంకరించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో సాయంత్రం పరస కార్యక్రమం నిర్వహించారు.



అలంకరణలో సీతారాములు

సినిమా గైడ్

● **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి),

● **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)

● **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24,టమాటా 24, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 46, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 38, బీరకాయలు 48, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 16, క్యారెట్ 22, దొండకాయలు 22, బంగాళా దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 120, బరబాటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 68, గోరుచిక్కుడు 38, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 250, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 40 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 24 , కంద 54, దేముడు చిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడి కాయ 26, క్యాబేజ్ పెండలం 20, మామిడిఅల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కనుసన్నల్లోనే ఆక్రమణలు

మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి

పెందుర్తి, జనవరి 24: మండలంలోని చింతగట్ల, జెర్రిపోతులపాలెంలలో స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కనుసన్నల్లోనే అధికార వైసీపీ నేతలు ఆక్రమణలకు పాల్పడుతున్నట్టు మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. జెర్రిపోతులపాలెంలో సర్వే నంబర్ 81-5లో గెడ్డ, రస్తాను అధికార పార్టీ నేతల సహకారంతో కొంతమంది ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తూ సర్పంచ్ మడక అప్పలరాజు ఆధ్వర్యంలో బుధవారం టీడీపీ, జనసేన కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బండారు ఇక్కడి గెడ్డను ఆక్రమించి నిర్మించిన ప్రహరీ, ఇతర కట్టడాలను పరిశీలించారు.ఆక్రమిస్తున్న భూమి గతంలో కొండనీరు ప్రవహించి మేహాద్రి రిజర్వాయర్‌లో కలిసే కాలువ అని, కల్వర్ట్ కూడా నిర్మించినట్టు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అండతో పెందుర్తిలో ఆక్రమణలు పెరిగిపోయాయని ఆరోపించారు. ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోకుంటే తాను దీక్షలకు దిగుతానని హెచ్చరించారు. ఇంతలో తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ అక్కడకు రావడంతో ఆయనకు బండారు ఆక్రమణలకు సంబంధించిన ఆధారాలను చూపారు. రెవెన్యూ అధికారులు పేరుతో ఇక్కడ జరుగుతున్న ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని కోరారు. సర్వే నిర్వహించి ఆక్రమణలు నిర్ధారణైతే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మడక పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న బండారు సత్యనారాయణమూర్తి

కార్మికుల జోలికొస్తే సత్తా ఏమిటో చూపిస్తాం

ఇంటక్ ఉక్కు ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 24: కార్మికులను ఇబ్బందులకు గురిచేసేందుకు ఉక్కు యాజమాన్యం కుట్ర పూరితంగా వ్యవహరిస్తుందని, ఇది మంచి పద్ధతి కాదని.. కార్మికుల జోలికి వస్తే వారి సత్తా ఏమిటో చూపిస్తామని ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ హెచ్చరించారు. ఎల్ఎంఎంఎం పార్కులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరేళ్లుగా కార్మికులకు వేతన సవరణ జరగలేదని, ఇందుకు గత, ప్రస్తుత గుర్తింపు సంఘాల అలసత్వమే కారణమన్నారు. చేతకాకపోతే కార్మికులకు క్షమాపణ చెప్పి ఎన్నికలకు రావాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన ఎన్‌జేసీఎస్‌లో గుర్తింపు యూనియన్ యాజమాన్యంపై ఒత్తిడి తేలేకపోయిందని, దీంతో కార్మికులకు నూతన వేతనాలు కలగానే మిగిలిపోయాయన్నారు. ఉక్కు యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేంత వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలను ఎదుర్కొనవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు కారు రమణ, బీఎస్ రాజు, ఎస్ఏ నాయుడు, బీఎంకే నాయక్, పీవీ నగేశ్, పోతారెడ్డి, కొమ్ము ప్రసాద్, మంత్రి గోపీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

ప్రజలందరికీ వైద్యాన్ని అందుబాటులోకి తేవడమే మా లక్ష్యం

టీడీపీ విశాఖ పార్లమెంటు ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్

పెదగంట్యాడ, జనవరి 24: ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తేవాలన్నదే తమ లక్ష్యమని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్ అన్నారు. ఎన్టీఆర్ సేవా సమితి, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం సీతానగరం ఆలయ సముదాయ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్య వైద్యాన్ని ప్రజలందరికీ ఉచితంగా అందించాలన్నదే టీడీపీ లక్ష్యమన్నారు. పేదలకు దూరమైన కార్పొరేట్ వైద్యాన్ని వారికి అందుబాటులోకి తెచ్చేందుకు ఎన్టీఆర్ సేవా సమితి, ఎంవీఎస్ మూర్తి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి పేదలకు రూ.మూడు లక్షల వరకు గీతం ఆస్పత్రిలో ఉచిత వైద్యాన్ని అందిస్తున్నామని, దీనిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు గీతం విద్యాసంస్థల అధినేత శ్రీభరత్ తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనద పేదల సంక్షేమం కోసం శ్రీభరత్ ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి నంబారు సింహాద్రి, ఉపాధ్యక్షుడు నక్క సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, టీడీపీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, పెద్దాడ సోమునాయుడు, ప్రసాదుల శ్రీనివాస్, ఎస్.అప్పారావు, ఎం.పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు. ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రజలకు నేత్ర, దంత, వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న శ్రీభరత్, పల్లా శ్రీనివాసరావు

ఘనంగా విద్యా దినోత్సవం

అగనంపూడి, జనవరి 24: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. శాంతి, అభివృద్ధి, ప్రపంచ అవగాహన పెంపొందించడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విద్య అందరినీ శక్తివంతం చేయడంతో పాటు స్థిరమైన అభివృద్ధి సాధించడానికి దోహదపడుతుందన్నారు. విద్యార్థులంతా చదువులో బాగా రాణిస్తే ఉజ్వల భవిష్యతు ఉంటుందని పేర్కొన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, కో-ఆర్డినేటర్ ఆర్.సుందరరావు, డీన్లు, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలి

అక్కిరెడ్డిపాలెం, జనవరి 24: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తమ ర్యాంకులు సాధించాలని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం, స్కూల్ కమిటి నాయకులు సంగ్రాన నూకరాజు, వి.రమణ, ఎస్.రాజు, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌పై ఫీట్లు.. నిలువనీడ లేక పాట్లు

» గోపాలపట్నం రైల్వే స్టేషన్ కూడలిలో బస్‌షెల్టర్ లేక అవస్థలు

» ప్రయాణికులకు పొంచి ఉన్న ప్రమాదం

గోపాలపట్నం, జనవరి 24: బస్‌షెల్టర్ లేక ప్రయాణికులకు ప్రమాదభరితమైన పరిస్థితి నెలకొంది. గోపాలపట్నం రైల్వే స్టేషన్ కూడలిలో దశాబ్దాల కాలంగా బస్‌స్టాపు ఉన్నా.. షెల్టర్ నిర్మాణం చేపట్టలేదు. దీంతో నిత్యం ఇక్కడనుంచి రాకపోకలుసాగించే అనేక మంది ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. షెల్టర్‌లేక బస్సుల కోసం రోడ్డుపైనున్న డివైడర్‌పై నిల్చుంటున్నారు. దీంతో బీఆర్‌టీఎస్‌పై, సర్వీస్‌రోడ్డులో వేగంగా వచ్చే వాహనాలు ఎవరిని ఢీకొంటాయో... ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భీతిల్లుతున్నారు. ప్రయాణికులకు కనీసం రోడ్డుపై నిల్చోడానికి కూడా స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు వచ్చిపోయే ఈ కూడలిలో నిలువనీడ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



డివైడర్‌పై నిల్చొని బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

వార్డుల్లో మౌలిక వసతులు: ఎమ్మెల్యే అదీప్ రాజ్



వెంకటసాయినగర్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

వేపగుంట జనవరి 24: వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 94వ వార్డులో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. వెంకటసాయినగర్‌లో జీవీఎంసీ నిధులు రూ.36.80లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించనున్నారు. అప్పలనర్సయ్య కాలనీలో రూ.30లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు, 92వ వార్డులోని బంటాకాలనీలో రూ.25లక్షలతో సీసీ రోడ్లు, కాలువను ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో జీవీ ఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వైసీపీ నాయకులు అప్పలస్వామినాయుడు, ఆదిరెడ్డి మురళి, బల్ల రాంబాబు, వర్మ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

97వ వార్డులో..

పెందుర్తి: గ్రేటర్ 97వ వార్డు పరిధిలో వివిధ కాలనీల్లో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ సేనాపతి వసంత ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. "రూ2కోట్లతో చేపట్టిన గోపాలకృష్ణనగర్,సప్తగిరినగర్, పీఎఫ్ కాలనీ, కార్మికనగర్, చినముషిడివాడ పాత ఊరు ప్రాంతాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో సేనాపతి శంకరరావు పాల్గొన్నారు.

'బాలికలు ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాలి'



బాలిక దినోత్సవంలో బెహరా కళాశాల విద్యార్థినులు

మల్కాపురం, జనవరి 24 : బాలికలు ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని సెయింట్ ఆన్స్ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు ఏ రోజా అన్నారు. బుధవారం కళాశాలలో నిర్వహించి బాలికల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. 2008 నుంచి ఏటా బాలికల దినోత్సవం జరుపుతున్నట్టు చెప్పారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఇవీఎస్ భాగ్యలక్ష్మి బాల్య వివాహాలపై, వై. అనసూయాదేవి బాలికల అక్రమ రవాణా, మహిళ చట్టాలపై మాట్లాడారు. గణిత శాస్త్ర అధ్యాపకురాలు సునీత మహిళలపై జరుగుతున్న దాడులపై చర్చించారు. ఈసందర్భంగానే ఇటీవల నాసిక్‌లో జరిగిన యువజన సమ్మేళనం లో పాల్గొన్న వలంటీర్లను సన్మానించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమకుమారి , ఎన్ఎస్ఎస్ యూనిట్ -3 అధికారి వి.అంజలీదేవి పాల్గొన్నారు.

గోపాలపట్నం: బాలికలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని బెహరా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సుకన్య అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని స్థానిక నరవ గ్రామంలో కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం, పోషణ, విద్య, సమస్యల పరిష్కారానికి గాను ఏ టా బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలతో ప్రమాదాలకు చెక్

» ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్

సింధియా, జనవరి 24: వాహనాలు నడిపేటప్పుడు భద్రతా నియమాలను లారీ డ్రైవర్లు పాటించి ప్రమాదాల నియంత్రణలో కీలక పాత్ర పోషించాలని ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌రుమార్ అన్నారు. డాక్‌యార్డు సమీపంలోని పోర్టు ఎగ్జామ్ ఏరియాలో బుధవారం నిర్వహించిన రహదారి వినియోగదారుల భద్రతా అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కొంతమంది లారీ డ్రైవర్ల నిరక్ష్యం వల్ల ప్రమాదాలు జరిగి చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అందువల్ల లారీ డ్రైవర్లందరూ వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హార్బర్ జోన్ ట్రాఫిక్ సీఐ ఎస్.షణ్ముఖరావు, మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ జి.అప్పారావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, లారీ ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు. అనంతరం లారీ డ్రైవర్ల అసోసియేషన్ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ఘనంగా డ్రైవర్స్ డే

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపోలో బుధవారం డ్రైవర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డిపోమేనేజర్ ప్రవీణ పాల్గొని డ్రైవర్స్‌కు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రజా రవాణాలో డ్రైవర్ పాత్ర కీలకమన్నారు. ప్రయాణికులనుగమ్యాలకు చేర్చడమే కాకుండా సంస్థకు ఆదాయం తేవడంలో ముఖ్యమన్నారు. ఈసందర్భంగా ప్రమాద రహిత డ్రైవర్ పీవీపీ రాజు చేతుల మీదుగా కేక్‌కట్ చేసి పంచారు. గాజువాక చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ రమణమ్మ, గాజువాక ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్ఎం యూనాయకులు శ్యామ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ రాజీవ్ కుమార్



షర్మిలకు వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు

షర్మిలకు వినతుల వెల్లువ

కూర్మన్నపాలెం, జనవరి 24: విశాఖ ఉక్కు కర్మాగారానికి భూములిచ్చిన నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం రిలే నిరాహార దీక్షల శిబిరానికి విచ్చేసిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు ఉక్కు కర్మాగార నిర్వాసితుల సంఘం సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పులి వెంకటరమణారెడ్డి, మంత్రి గోపి, నమ్మి అప్పలనాయుడు, గొందేశి నాగిరెడ్డి, దొమ్మేటి అప్పారావు, తదితరులు ఉన్నారు. అలాగే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చూడాలంటూ ఉక్కు నిర్వాసిత ఐక్య సంఘం, విశాఖ ఉక్కు నిర్వాసిత లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు షర్మిలకు వినతిని అందించారు. 'ఉక్కు'ను ప్రైవేటీకరించరాదంటూ మూడేళ్లుగా ఆందోళనలు చేస్తున్నా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని.. ఈ అంశాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకువెళ్లి స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూడాలని కోరుతూ విజ్ఞాపనా పత్రాన్ని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అందజేశారు. వినతిని అందజేసిన వారిలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, గంగవరం గోపి, పరందామయ్య, యు.రామస్వామి, వి.ప్రసాద్,రామ్మోహన్‌కుమార్ తదితరులు ఉన్నారు.



బుల్‌డోజర్లతో స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

చురుగ్గా సాగుతున్న హెచ్‌బీ కాలనీ పార్కు పనులు

రెండు నెలల్లో అందుబాటులోకి తెస్తామంటున్న అధికారులు

గాజువాక, జనవరి 24: జీవీఎంసీ 76వ వార్డు పరిధి హెచ్‌బీ కాలనీలోని పార్కు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు ఐదు కోట్ల రూపాయల జీవీఎంసీ నిధులతో హెచ్‌బీ కాలనీలో ఉన్న ఐదెకరాల స్థలంలో అధునాతన పార్కును అభివృద్ధి చేస్తున్నారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో సువిశాలమైన స్థలం ఈ వార్డులోనే ఉండడంతో అధునాతనంగా పార్కును ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత వాసులందరికీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్న యోచనతో జీవీఎంసీ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించి నిర్మాణ పనులు సాగిస్తున్నారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఆడిటోరియంతో పాటు టెన్నిస్, వాలీబాల్, క్రికెట్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నారు. పార్కు మధ్యలో వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో ఫ్లవర్ గార్డెన్, చుట్టూ మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వృద్ధుల కోసం ప్రత్యేకంగా వ్యాయామానికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. గత రెండు నెలల కిందట పనులు ప్రారంభం కాగా రెండడుగులు మేర మట్టిని వేసి వర్షపు నీరు నిల్వ ఉండకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నారు. పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు మరో రెండు నెలల వ్యవధి పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

గెడ్డ ఆధునికీకరణ పనులు చేపట్టాలి

» ఎన్ఎస్‌టీఎల్‌కు ఎమ్మెల్యే గణబాబు విజ్ఞప్తి



హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జనవరి 24 : హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నరాజ్‌ను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) బుధవారం కలిసి పలు విషయాలపై చర్చించారు. శ్రీహరిపురం కొండ ప్రాంతం నుంచి శ్రీ హరిపురం మెయిన్‌రోడ్డు మసీద్ మీదుగా గుల్లలపాలెం, హెచ్‌పీసీఎల్ వరకు గెడ్డ అ ధునీకరణ పనులు, డీపీఆర్ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే, ప్రత్యేక నిధులతో గెడ్డల ఆధునికీకరణ పనులుపూర్తిచేయాలని కోరారు. స్థానికులకు పరిశ్రమలో ఉపాధి కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లాచిన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పరస...

సింధియా, జనవరి 24: జీవీఎంసీ 63వ వార్డు చింతలలోవలో బుధవారం మరిడిమాంబ అమ్మవారి పరస ఘనంగా జరిగింది. గ్రామదేవతను ఎమ్మెల్యేగణబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా చిన్న, జోగి, జెర్రిపోతుల నరసింగరావు, పుక్కల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివి..

వేపగుంట: పద్మనాభనగర్ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలివేయనున్నట్లు వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి తెలిపారు. పద్మనాభనగర్, కంపరపాలెం కాలనీ, జనతాకాలనీ, నందమూరినగర్ తదితర ప్రాంత వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెందుర్తి పరిధిలో..

పెందుర్తి: సుజాతనగర్ సబ్‌స్టేషన్ పరిధి మరమ్మతు పనులు చేపడుతున్న గురువారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఎస్సీబీసీ కాలనీ, రిజిస్ట్రార్ కార్యాలయం, లక్ష్మీనగర్, కిశోర్‌లేఅవుట్, పీఎఫ్ కాలనీ, చాణక్యనగర్, చినముషిడివాడ, అగ్రికల్చర్ కళాశాల ఏరియా, ఎస్‌పీడీ లేఅవుట్ తదితర ప్రాంతాల ప్రజలు సహకరించాలన్నారు. అలాగే, పెందుర్తి పరిధి బీసీ కాలనీ, నల్లక్వారీ, సూర్యానగర్, సాయిదివ్య లేఅవుట్, కామక్షమ్మ టెంపుల్, ఉప్పరన కాలనీ, తహసీల్దార్ కార్యాలయం. జూనియర్ కాలేజీ, గాంధీనగర్, నేతాజీనగర్, రెల్లికాలనీ, నారాయణమ్మ కాంప్లెక్స్ పరిధిలోనూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

సింధియా, జనవరి 24: ఏకేసీ కాలనీ ప్రధాన రహదారిపై కొద్దిరోజులుగా ప్రధాన పైపులైన్ లీక్‌తో తాగునీరు వృధాగా పోతోంది. దీంతో బుధవారం జీవీఎంసీ సిబ్బంది పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. రహదారిపై ఈ నీటిని తొలగించారు. దీంతో ఇబ్బందులు తొలగడంతో వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

'సీఎం సభను జయప్రదం చేయండి'

గోపాలపట్నం, జనవరి 24: తగరపువలస సమీపంలో ఈ నెల 27న జరగనున్న సీఎం జగన్ బహిరంగ సభను జయప్రదం చేయాలని జీవీఎంపీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. స్థానిక కుమారి కల్యాణ మండపంలో 91, 92 వార్డుల వైసీపీ కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బెహరా మాట్లాడుతూ తగరపువలస సమీపంలోని అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభ్యలో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వార్డు వైసీపీ నేతలు, కార్యకర్తలు తదతరులు పాల్గొన్నారు.

కేవీలో చిత్రలేఖన పోటీలు

అక్కయ్యపాలెం, జనవరి 24: తాటిచెట్లపాలెంలోని పీఎంసీ కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన పరీక్ష పే చర్చ- 2024పై చిత్రలేఖన పోటీలను బుధవారం ప్రిన్సిపాల్ కమల్‌జిత్ ప్రారంభించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన వందమంది విద్యార్థులుపాల్గొన్నారు.న్యాయనిర్ణేతలుగావిద్యావేత్త విజయ,విశ్రాంతచిత్రకళ ఉపాధ్యాయుడు కె.సుబ్బారావు, ఉపాధ్యాయుడు విశ్వజిత్ వ్యవహరించారు.

బీసీసీఐ కార్యదర్శికి ఆహ్వానం


జై షాను ఆహ్వానిస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి

విశాఖపట్నం (స్పోర్ట్స్), జనవరి 24: ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో వేదికగా రెండో తేదీ నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య టెస్ట్ మ్యా చ్ ప్రత్యక్ష వీక్షణకు భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి జై షాను ఆహ్వానించినట్టు ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన బీసీసీఐ వార్షిక అ వార్డు కార్యక్రమానికి హాజరైన కార్యదర్శి జై షాను ఏసీఏ అధ్య క్షుడు శరత్ చంద్రారెడ్డితో కలిసినట్టు చెప్పారు. టెస్ట్ మ్యాచ్‌కు ఆహ్వానించామన్నారు.

30 మంది ఎస్‌ఐలకు పదోన్నతి

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్ పరిధిలో 2009 బ్యాచ్‌కు చెందిన 30 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ రేంజ్ ఐజీ హరికృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. బూరాడ అప్పలనాయుడు, దుంపల దీనబంధు, ఎస్.సన్యాసినాయుడులను అనకాపల్లి జిల్లాకు, లొద్ద రామకృష్ణ, ఎస్.సోమరాజులను విశాఖ సిటీ, కింతలి నారాయణ రావు, ముదిలి శ్రీనివాసరావు, జి.బాలకృష్ణను విజయనగరం పీటీసీ కళాశాలకు, చింతాడ ప్రసాద్, వి.రమేష్, ఎస్.లక్ష్మణరావు, జి.శ్రీనివాసరావును శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. కె.మల్లేశ్వరరావు, వి.శంకర నారాయణ, కె.జీవనకాంత్, టి.క్రాంతికుమార్, బి.లక్ష్మణరావు, వి.రామా రావు, వి.నారాయణ మూర్తిలను ఇంటెలిజెన్స్‌కు, వి.నాగరాజు, జి.అర్జున, జి.మల్లేశ్వరి, బి.మంగరాజులను సీఐడీకు, ఎ.ప్రసాదరావును మెరైన్ విభాగానికి, బి.అప్పలనాయుడు, కె.కామేశ్వరావులను రైల్వేస్, ఎం.శ్రీనును ట్రాన్స్‌కో, ఎం.చిన్నంనాయుడును ఏసీబీకి కేటాయించారు.

రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోంది: టీడీపీ

డాబాగార్డెన్స్ , జనవరి 24: అంగన్‌వాడీలపై పోలీసుల దమనకాండ దారుణమని టీడీపీ నాయకులు అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ చోడవరం పరిశీలకులు వీవీఎస్ మూర్తియాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతుందని ఆరోపించారు. టీడీపీ హయాంలో బీసీ, ఎస్సీఎస్టీలకు ప్రాధాన్యం లభించిందన్నారు. రాష్ట్రంలోని లాండ్ , శాండ్, వైన్ దోపిడీ సాగుతోందన్నారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ , మాజీ ప్రధాన కార్యదర్శి పాండ్రంగి జయరాజు,పెంటకోటశ్రీనాథ్, చిన్నాయాదవ్, సూర్యప్రకాష్, అప్పలరాజు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

» విశాఖ డీటీసీ రాజారత్నం

మురళీనగర్, జనవరి 24 ; వాహనం నడిపే సమయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ప్రమాదాలు నివారించాలని విశాఖ డీటీసీ జి.సి. రాజారత్నం సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం లారీ ఆపరేటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ భాగస్వామ్యంతో వైద్యశిబిరం, అవగాహన శిబిరం నిర్వహించారు. డీటీసీ మాట్లాడుతూ, వాహనం నడిపే సమయంలో మాట్లాడుతుండంతో బైకులు, లారీలు ప్రమాదాలు జరుగుతున్నట్టు చెప్పారు. ఆటోలు ఈ రకమైన ప్రమాదాల్లో మూడో స్థానంలో ఉన్నట్టు గణాంకాల వారీగా వివరించారు. మద్యం సేవించి ఎట్టిపరిస్థితుల్లో వాహనాలు నడపరాదన్నారు. డ్రైవింగ్ వృత్తిలో క్రమ శిక్షణతో ఉంటూ ఆరోగ్యాలను కాపాడుకోవడం ద్వారా కుటుంబాలకు మెరుగైన భవిష్యత్తు ఇవ్వాలని అన్నారు. బీపీ, షుగర్, కంటి సమస్యలపై ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వాహనాలను కండిషన్‌లో ఉంచడం ద్వారా రోడ్డు ప్రమాదాల్ని నివారించవచ్చని సూచించారు. ఈ సమావేశంలో ఆర్టీఓ ఆర్సీహెచ్ శ్రీనివాస్, విశాఖ లారీ ఆపరేటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు బాపిరాజు, వ్యవస్థాపక సభ్యులు కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ఆర్టీఏ కార్యాలయ ప్రతినిధులు

క్షతగాత్రులకు సాయమందించాలి: ఎస్‌ఐ

సీతంపేట: రోడ్డు ప్రమాదాల సమయంలో క్షతగ్రతులకు సహాయం అందించడంతోపాటు పోలీసులకు సమాచారమందించాలని ద్వారకా పోలీసు స్టేషన్ ఎస్ఐ ఎన్ భాస్కరరావు కోరారు. గురుద్వార కూడలిలోని ఆటో స్టాండ్‌లో డ్రైవర్స్‌తో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగ్గా లైసెన్స్, ఆటోకి ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగినప్పుడు క్షతగ్రతులు ప్రాణాపాయ స్థితిలో ఉంటే వారిని ఆసుపత్రిలో చేర్పించాలని, మాదక ద్రవ్యాలు తరలిస్తున్నట్టు తెలిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు.

జనసేన పార్టీలో చేరికలు


జనసేనలో చేరిన నాయకులు, కార్యకర్తలు

అక్కయ్యపాలెం, జనవరి 24: గ్రేటర్ 42వ వార్డులో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సందపర్తి వెంకట త్రినాద్ మూర్తి, అలాగే మరో 300 మంది జనసేన పార్టీలో చేరారు. ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్, నార్త్ ఇన్‌చార్జి ఉషాకిరణ్ జనసేన కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సంకు వెంకటేశ్వరరావు, వసంత లక్ష్మి, కందుల నాగరాజు, శివప్రసాద్ రెడ్డి, ముమ్మిడి నాగమణి, శ్రీధర్, దివాకర్, అప్పారావు కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. కోట్లతో వసతుల కల్పన: మేయర్

అక్కయ్యపాలెం, జనవరి 24: నగర వాసులకు మౌలిక వసతుల కల్పనకు రూ. కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్టు మేయర్ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. గ్రేటర్ 26వ వార్డు శాంతిపురంలో రూ.29.70 లక్షల వ్యయంతో బీటీ రోడ్లతోపాటు, పలు అభివృద్ధి నిర్మాణ పనులకు బుధవారం రాష్ట్ర నెడ్‌క్యాప్ ఛైర్మన్ కేకే రాజు, మేయర్ శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ డీఈ శ్రీనివాసరావు, ఏఈ నిహారిక, వైసీపీ నాయకులు బొడ్డేటి కిరణ్, పాండవ శ్రీను, అమ్మాజి పాల్గొన్నారు.

మత సామరస్యంతో శాంతిస్థాపన

» గాంధీ సెంటర్ అధ్యక్షులు ఆచార్య బాలమోహన్‌దాస్


పోస్టర్‌ని ప్రదర్శిస్తున్న అతిథులు, నిర్వాహకులు

సీతమ్మధార, జనవరి 24: సర్వ మతాలు ఐక్యంగా ఉంటేనే శాంతి స్థాపన సాధ్యమని గాంధీ సెంటర్ అధ్యక్షులు ఆచార్య బాలమోహన్‌దాస్ పేర్కొన్నారు. డాక్టర్ బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాలులో గాంధీ సెంటర్, బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మనీ, ఇంటర్ నేషనల్ అసోసియేషన్ ఫర్ రీలిజియన్ ఫ్రీడమ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 'మహాత్మాగాంధీ మత సామరస్యం' అనే అంశంపై చర్చగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా సభికులతో శాంతిపై ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ, దేశభక్తి, కులం, మతం అనేవి పూర్తి వ్యక్తిగత విషయాలన్నారు. అన్ని మతాల వారు కలిసి జీవించడం భారత దేశ సంస్కృతి అని అన్నారు. హైదరాబాద్‌కు చెందిన విజయ విహారం ఎడిటర్ రమణమూర్తి మాట్లాడుతూ, అంతా కలిసి జీవించడం భారత వారసత్వమని, గాంధీ బోధనలు విలువలు, తగిన ప్రాధాన్యం కల్పించలేకపోతున్నామని ఆయన విచారం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో సంస్థ ఛైర్మన్ నరవ ప్రకాశరావు, డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానులన్నారు, ఒక్కటీ లేకుండా చేశారు

... 5వ పేజీ తరువాయి

షర్మిల స్పష్టం చేశారు. విభజన హామీల అమలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ, టీడీపీలు బీజేపీతో కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. వైసీపీ రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెడుతోందని ఆరోపించారు. బీజేపీతో వైసీపీ కంటికి కనిపించని పొత్తు పెట్టుకుందన్నారు. వైసీపీ పాలనా వైఫల్యాలను ప్రజలు దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడడం ఖాయమన్నారు.

జగనన్న గారు మరచిపోయారా...?

ప్రత్యేక హోదా సాధన కోసం తెలుగుదేశం, వైసీపీ ఎంపీలంతా కలిసి మూకుమ్మడిగా రాజీనామాలు చేద్దామని జగనన్న గారు గత ఎన్నికల ముందు చెప్పి మరచిపోయారని షర్మిల ఎద్దేవా చేశారు. ఆయన సీఎం అయిన తరువాత ప్రత్యేక హోదా గురించి ఒక్కసారి కూడా నోరు విప్పలేదని విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం ఉద్యమం చేయకపోగా కనీసం మాట వరుసకైనా కేంద్రాన్ని నిలదీయలేదన్నారు. ప్రత్యేక హోదా పూర్తిగా మూలకు చేరగా, కనీసం ప్రత్యేక ప్యాకేజీ కూడా సాధించలేదని పరిస్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. పోలవరానికి 90 శాతం నిధులు ఇస్తామన్న కేంద్రం...తన మాట నిలుపుకోలేదన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయ్యిందని, చంద్రబాబునాయుడు ఒక రాజధాని అంటే...జగనన్న గారు మూడు రాజధానులన్నారని, తీరా చూస్తే రాష్ట్రానికి ఒక్క రాజధానే లేకుండాపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు పార్టీ నాయకులు, వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధుల నుంచి ఆమె సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులతో షర్మిల మాట్లాడారు. మత్స్యకార నాయకుడు జగన్ మాట్లాడుతూ మత్స్యకారులకు సబ్సిడీపై డీజిల్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిపరమైన సహాయం లేకపోవడంతో చాలామంది వలస వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మత్స్యకారులను ఆదుకుంటామని ఈ సందర్భంగా షర్మిల భరోసా ఇచ్చారు. దక్షిణ నియోజకవర్గానికి చెందిన దార్ల శ్రీనుతోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ హయాంలో చెత్త పన్ను వేశారని, ఇంటి పన్ను ఇష్టానుసారం పెంచారని చెప్పారు. భారత్ బచావో స్వచ్ఛంద సంస్థ సభ్యుడు ఎస్ఆర్ వేమన మాట్లాడుతూ బీజేపీని ఓడించేందుకు ముందుకు వచ్చే శక్తులతో కలిసి పనిచేస్తామన్నారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి బీజేపీ రాజ్యాంగాన్ని అమలు చేసే ప్రమాదముందన్నారు. సమావేశంలో కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, సీనియర్ నాయకులు కొప్పుల రాజు, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, పార్టీ ఉత్తరాంధ్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, నగర పార్టీ ప్రెసిడెంట్ గంపా గోవింద్, నాయకులు వజ్జపర్తి శ్రీనివాసరావు, చోడదాసి సుధాకర్, మూల వెంకటరావు, గుత్తుల శ్రీనివాస్, జగన్ మురారి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో పలువురు చేరిక

షర్మిల సమక్షంలో పలువురు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి షర్మిల ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఏపీటీఎస్ (ఏపీ టెక్నాలజీ సర్వీసెస్) మాజీ చైర్మన్ కొయ్య ప్రసాదరెడ్డి, హాసిని గ్రూపు అధినేత హాసిని, వైసీపీ నాయకులు ఏపీ వర్మ, బట్ట స్వర్ణ, టీవీ సీరియల్ నటి సరస్వతి, దార్ల శ్రీను, తలారి సురేష్, ఐ.అప్పలరాజు, బ్రహ్మస్వరూప్, కె.రామారావు, సీజీఎస్ సత్యం, స్వరూప్‌తోపాటు వంద మందికిపైగా నాయకులు, కార్యకర్తలు షర్మిల సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి షర్మిల కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.





వైసీపీ అక్రమాలపై షర్మిలకు బీవీ రామ్ వినతి

సాగర్‌నగర్, జనవరి 24 : వైసీపీ ప్రభుత్వం అక్రమాలు, అరాచకాలపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ వినతిపత్రం అందించారు. బుధవారం ఆయన దసపల్లా హోటల్‌లో షర్మిలను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రామ్ విలేకరులతో మాట్లాడుతూ జగన్‌కు ఒక్క చాన్స్ ఇచ్చినందుకు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారన్నారు. వైసీపీ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. ఇదే విషయమై షర్మిలతో చర్చించినట్టు తెలిపారు. జగన్ ఒక మానసిక రోగి అని, అతని గురించి షర్మిలకే ఎక్కువగా తెలిసి ఉంటుందన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. 27న జరిగే ముఖ్యమంత్రి బహిరంగ సభకు ముందుగానే అభివృద్ధిపై చర్చించేందుకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమైనా ముఖ్యమంత్రిలో ఇప్పటివరకు చలనం లేదన్నారు. మద్యపాన నిషేధం అమలు ఏమైందని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణలో వైసీపీ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు డాక్టర్ పప్పూర్‌నికుంజ్, వెంకటేశ్వరరావు ఉన్నారు.

వైసీపీ 'దక్షిణ'లో అదే తీరు

» సమన్వయకర్త వైవీ సమావేశానికి వార్డు అధ్యక్షులు డుమ్మా
» ముగ్గురు కార్పొరేటర్లు మాత్రమే హాజరు

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలో వైసీపీ నేతల మధ్య విభేదాలు పరిష్కారమయ్యేలా కనిపించడం లేదు. ఎండాడ పార్టీ కార్యాలయంలో ఆపార్టీ ఉమ్మడి విశాఖ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశానికి దక్షిణనియోజకవర్గంలోని కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు డుమ్మా కొట్టారు. ఈనెల 27న భీమిలి మండలంలో జరిగే పార్టీ ఉత్తరాంధ్ర స్థాయిసమన్వయ సదస్సు జనసమీకరణకు నియోజకవర్గాల వారీగా ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణం నేతల స్పందనచూసి సుబ్బారెడ్డితోపాటు ఇతర నేతలు కంగుతిన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లితోపాటు కార్పొరేటర్లు తోటపద్మావతి, అప్పలకొండ, కోడిగుడ్ల పూర్ణిమ మాత్రమే హాజరయ్యారు. వార్డు అధ్యక్షులు, నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారిలో ఒకరిద్దరు మాత్రమే కనిపించడంతో సుబ్బారెడ్డి దీనిపై నేతలవద్ద ఆరాతీసినట్టు తెలిసింది. ఎన్నికలకు రెండు నెలలు గడువుమాత్రమే ఉందని, ఈసమయంలో నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితి ఉంటే ఎలాగంటూ అసంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. ఎన్నిసార్లు సమా వేశం ఏర్పాటుచేసినా ఇదేస్థితి ఉండడంపై అసహనం వ్యక్తంచేసినట్టు సమాచారం. నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారు, పార్టీఅనుబంధ సంఘాల నేతలనుకలుపుకుని వెళ్లాలని వాసుపల్లికి సూచించినట్టు తెలిసింది.

'జర్నలిస్టులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

మహారాణిపేట, జనవరి 24: జర్నలిస్టులకు ఉచితంగా లేదా నామమాత్ర ధరకే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కోరారు. మంగళవారంకలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కె ఎస్ విశ్వనాథన్‌ను కలసి వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల జీవోలో 40, 60 శాతం నిష్పత్తి ద్వారా ధర ని ర్ణయాన్ని సవరించాలన్నారు. లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సత్యనారా యణ, కె చంద్రమోహన్, బందరు శివప్రసాద్, అబ్బాస్, వి. శ్రీధర్, ఎం శ్రీహరి పాల్గొన్నారు.

సెమిస్టర్స్‌లో కెమికల్ విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణత

కంచరపాలెం, జనవరి 24: స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమో ఏడో సెమిస్టర్ విద్యార్థులు రికార్డుస్థాయిలో ఉత్తీర్ణత సాధించారు. గత డిసెంబర్‌లో జరిగిన సెమిస్టర్ పరీక్షలో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. గత 50ఏళ్లఈ కళాశాల రికార్డులో శతశాతం ఉత్తీర్ణత సాధించడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్‌లో జరిగిన పరీక్షలో ఏడో సెమిస్టర్ నుంచి 61 విద్యార్థులు హాజరుకాగా, మొత్తం ఉత్తీర్ణులయ్యారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ బుధవారం కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు శతశాతం విద్యార్థులు ఉత్తీర్ణులుకావడం అధ్యాపకుల శ్రమ, గొప్పతనం ఉందని కొనియాడారు.సీనియర్ అధ్యాపకులు బీవీ లక్ష్మణరావు, ఎం.విజయలక్ష్మి, బి హేమేంద్ర ప్రదీప్‌కుమార్, ఎల్ గీతిక పాల్గొన్నారు.


ఉత్తీర్ణులైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కె.వి.రమణ,అధ్యాపకులు

'కళింగ కోమట్లకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి'


షర్మిలకు వినతి పత్రం అందజేస్తున్న కిశోర్

మహారాణిపేట, జనవరి 24: ఉత్తరాంధ్ర కళింగ కోమట్లకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ కళింగ కోమట్ల సం క్షేమ అధ్యక్షుడు లాడి కిశోర్ కుమార్ కోరారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిలను కలిసి ఈమేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ య న మాట్లాడుతూ, కళింగ కోమట్లు ఉత్తరాం ధ్రలోని 30 నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపు ను ప్రభావం చేసే స్థితిలో ఉన్నారన్నారు. అయి నా, ఏ రాజకీయ పార్టీ తమకు గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థితిలో కళింగకోమట్లు ప్రజా ప్రతినిధులుగా పోటీ చేసే అవకాశం కల్పించాలని ఆమెను కోరినట్లు చెప్పారు.

కనీస చర్చ లేకుండానే...

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టు ఇచ్చిన అధికారులు, ఇప్పుడు అదనంగా రూ.33.83 లక్షలు వెచ్చించి అద్దె ప్రాతిపదికన లారీలను సమకూర్చుకోవాలనే ప్రతిపాదనపై కూడా సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేయకపోవడం విశేషం. ఈ సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతోపాటు కార్యదర్శి నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో యువ ఓటర్లు 38,265 మంది

... 5వ పేజీ తరువాయి

నియోజక వర్గంలో 6,350 మంది ఓటర్లుగా చేరారు. ఓటు నమోదుపై కళాశాలలు, వర్సిటీల్లో ప్రచారం చేసినా సగానికి పైగా యువతీయువకులు ఆసక్తి చూపలేదు. తుది ఓటర్ల జాబితా విడుదలైనా...యువతీయువకులు ఓటు నమోదు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా అధికారులు కోరుతున్నారు.

పర్యాటక ప్రాజెక్టులు ప్రైవేటుపరం!

... 5వ పేజీ తరువాయి

ఏపీటీడీసీ 40 మంది సిబ్బందిని ఉపయోగించుకుంటోంది. వారికి జీతాలు చెల్లిస్తోంది.

- అనంతగిరి మండలం తైడా జంగిల్ బెల్స్‌లో 23 రూములు ఉండగా వాటిలో 13 ఆపరేషన్‌లో ఉన్నాయి. అక్కడ నెలకు రూ.25 లక్షల ఆదాయం వస్తోంది. అంటే ఏడాదికి రూ.3 కోట్లు. అక్కడ 25 మంది పనిచేస్తున్నారు.
- అనంతగిరిలో 28 రూములు ఉండగా నెలకు రూ.40 లక్షల ఆదాయం వస్తోంది. ఏడాదికి రూ.4.8 కోట్లు. ఇక్కడ 30 మంది పనిచేస్తున్నారు.
- అరకులోని మయూరి రిసార్ట్‌లో 85 రూములు ఉన్నాయి. నెలకు రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. ఏడాదికి రూ.7.2 కోట్లు. అక్కడ 60 మంది పనిచేస్తున్నారు.
- అరకులోయ వేలీ రిసార్ట్‌లో 45 రూములు ఉన్నాయి. నెలకు రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. అక్కడ కూడా 60 మంది పనిచేస్తున్నారు.
- లంబసింగిలో 15 టెంట్ రూములు ఉన్నాయి. సీజన్‌లో నెలకు రూ.15 లక్షల ఆదాయం వస్తోంది. మొత్తం చూసుకుంటే ఏడాదికి కోటి రూపాయలు వస్తుంది. ఇక్కడ 15 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

..ఈ లెక్కన చూసుకుంటే వీటన్నింటి ద్వారా ఏడాదికి రూ.28 కోట్ల ఆదాయం వస్తోంది. సిబ్బంది జీతాలకు రూ.8 కోట్లు తీసేస్తే నికరంగా రూ.23 కోట్ల ఆదాయం ఏటీడీసీకి మిగులుతోంది. ఇప్పుడు ఇంతకు మించిన ఆదాయం రావాలి. కానీ ప్రభుత్వం టెండర్ ప్రకారం లీజు ద్వారా రూ.7.35 కోట్లు, ఆదాయంలో 24 శాతం (రూ.28 కోట్లలో నాలుగో వంతు) రూ.7 కోట్లు కలిపి సుమారు రూ.15 కోట్లు ఇస్తే చాలని నిబంధనలు పెట్టింది. ఇది కారుచౌక బేరం. ప్రభుత్వ నిర్వహణ కంటే ప్రైవేటు నిర్వహణ బాగుంటుంది కాబట్టి ఇంకా ఎక్కువ ఆదాయం వస్తుంది. వైసీపీకి చెందిన వారికి పర్యాటక ప్రాజెక్టులన్నీ కట్టబెట్టడానికే ఈ ప్రకటన ఇచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రేవుపోలవరం, అనంతగిరి కాఫీ హౌస్ కూడా

అనకాపల్లి జిల్లాలోని రేవుపోలవరం బీచ్‌లో షాక్స్ పేరుతో మూడు రెస్టారెంట్లు ఉన్నాయి. వాటిని కూడా లీజుకు ఇచ్చేస్తామని ప్రకటించారు. ఏడాదికి రూ.7.85 లక్షల అద్దె, వచ్చే ఆదాయంలో 10 శాతం వాటా ఇస్తే...18 ఏళ్లకు లీజుకు ఇస్తామని నోటిఫికేషన్ ఇచ్చారు. అలాగే అనంతగిరిలో కాఫీకి సంబంధించి రీసెర్చ్ డెవలప్‌మెంట్ భవనం ఉంది. దానిని 'కాఫీ హౌస్'గా వ్యవహరిస్తారు. దానిని కూడా ఏడాదికి రూ.1.1 లక్షలకు లీజు నిర్ణయించారు. వచ్చే ఆదాయంలో 10 శాతం అదనంగా ఇస్తే నాలుగేళ్ల లీజుకు ఇస్తామని ప్రకటించారు.

విశాఖలో పీపీపీలో ఫైవ్ స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం

విశాఖపట్నంలో 5 స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్‌ను పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో నిర్మించి, నిర్వహించడానికి కూడా టెండర్ పిలిచారు. వాస్తవానికి రుషికొండపై ఫైవ్ స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ రూ.450 కోట్లతో సీఎం క్యాంపు కార్యాలయం మాత్రమే నిర్మించారు. హోటల్, కన్వెన్షన్ సెంటర్లు లేవు. ఇప్పుడు పీపీపీలో నిర్మించడానికి టెండర్లు ఆహ్వానించారు. అయితే అది రుషికొండపైనా, సాగర్‌నగర్‌లో ఉన్న 3 ఎకరాల్లోనా అనేది ప్రకటించలేదు. అయితే ప్రాజెక్టు నిర్మించేందుకు ఇచ్చే భూమికి సబ్ రిజిస్ట్రార్ విలువలో ఒక శాతం లీజుగా, 4 శాతం డెవలప్‌మెంట్ ఫీజుగా, ఆదాయంలో మరో 4 శాతం వాటాగా ఇవ్వాల్సి ఉంటుందని నిబంధన పెట్టారు. ఇలా ఎవరైనా ముందుకువస్తే వారికి 33 ఏళ్లకు లీజు ఇస్తామని ప్రకటించారు.

తప్పుల తడకలుగా ఓటర్ల జాబితాలు

... 5వ పేజీ తరువాయి

జాబితా విడుదల చేశారు. అందులో ఆ పేర్లు అదే ఇంటి నంబరులో ఉన్నాయి. తొలగించలేదు. దాంతో విష్ణుకుమార్‌రాజు నవంబరు 16న నేరుగా జిల్లా రిటర్నింగ్ అధికారి అయిన కలెక్టర్ మల్లికార్జునను కలిసి ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై ఆయన ఢిల్లీలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు కూడా డిసెంబరు 14న ఫిర్యాదు చేశారు. ఆయన కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఐదు మాత్రమే తొలగించారు: విష్ణుకుమార్‌రాజు

అయితే తాజాగా ఓటర్ల జాబితాలో చూడగా ఆ ఇంటి నంబరుపై 67 ఓట్లలో కేవలం ఐదు మాత్రమే తొలగించారని, మరో పది మంది పేర్లు వారి ఇంటి నంబర్లకు కలిపారని, ఇంకా 50 మంది బోగస్ ఓటర్లు ఉండగా వారికి ఇంటి నంబర్లు 49-54-8 నుంచి ఈఆర్ 1, ఈఆర్ 2...అంటూ సీరియల్‌గా ఇచ్చేసి అలాగే కొనసాగించారని విష్ణుకుమార్‌రాజు ఆరోపించారు. స్థానికంగా లేనివారిని ఇక్కడ ఓటర్లుగా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఇలా అధికార పార్టీ వైసీపీ అడ్డదారిలో ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దీనిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'తూర్పు'లో డబుల్ ఎంట్రీలు

... 5వ పేజీ తరువాయి

ఐడీపై 1436055, ఐడీపై 2735041 నంబర్లతో ఓటు హక్కు కల్పించారు. ఇదే బూత్ శివాలయం వీధిలో ఇంటినంబరు 54-6-5లో ఉంటున్న పెంటకోట దివ్యకు రెండు ఓట్లు (వరుస సంఖ్య 620, 621...ఐడీపై 3560570, ఐడీపై 3555414) ఉన్నాయి. ఇంకా రాపేటి చరణ్‌కు (వరుస సంఖ్య 602, 603) రెండు ఓట్లు ఉన్నాయి. కాగా పాత ఆరిలోవ ప్రాంతంలో 11వ వార్డులో బూత్ నంబర్ 30 పరిధిలోని ఇంటి నంబరు 13-1441లో నివాసం ఉంటున్న విధనలక్ష్మి మృతి చెందినా ఆమె ఓటు జాబితా నుంచి తొలగించలేదు. ఇదే బూత్‌లో మృతిచెందిన సప్ప మల్లేశు ఓటు అలాగే ఉంది. ఇదే బూత్‌లో ఇంటి నంబరు 13-1440లో ఉంటున్న బొట్టా చిట్టెమ్మకు 603, 605 సంబర్లతో రెండు ఓట్లు ఉన్నాయి.

విదేశీ పర్యాటకునిపై గుర్తు తెలియని యువకుల దాడి


గాయపడిన విదేశీయుడు

గాజువాక, జనవరి 24: విదేశీ పర్యాటకునిపై దాడి చేసి సెల్ ఫోన్ ఎత్తుకుపోయిన సంఘటన యారాడబీచ్‌లో బుధవారం చోటుచేసుకుంది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి.. స్విట్జర్లాండ్‌కు చెందిన నోహ ఎల్లియస్ అనే యువకుడు టూరిస్టు వీసాపై ఇండియా వచ్చి పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఎల్లియస్ యారాడ బీచ్‌కు వచ్చి కొండపై ట్రెక్కింగ్ చేస్తున్నాడు. ఈ సమయంలో ముగ్గురు గుర్తు తెలియని యువకులు వచ్చి ఆయనపై దాడి చేసి విలువైన సెల్ ఫోన్‌ను ఎత్తుకుపోయారు. గమనించిన పలువురు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్నిఏడీసీపీ గంగాధర్, హార్బర్ ఏసీపీ మోసెస్ రాజు, సీఐ ఎర్రన్నా యుడు పరిశీలించారు. కాగా ముగ్గురు యువకుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మిగిలిన ఇద్దరు కోసం గాలిస్తున్నారు.


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న షర్మిల


సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం నగరంలో పర్యటించారు. దసపల్లా హోటల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురికి కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం స్టీల్ ప్లాంట్ వద్ద కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తూ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని హామీ ఇచ్చారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం,జనవరి 24 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ప్రహ్లాద ప్రార్థనా మందిరం స్వాధీనం చేసుకోవాలని వినతి

సింహాచలం, జనవరి 24 : జగదాంబ జంక్షన్ వద్ద కోట్లాది రూపాయల విలువ చేసే ప్రహ్లాద ప్రార్థనా మందిరాన్ని సీఆర్‌పీఎఫ్ నుంచి స్వాధీనం చేసుకోవాలని సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు ఈఓ శ్రీనివాసమూర్తిని కోరారు. బుధవారం ఆయన ఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ 2013 ఏప్రిల్‌లో ఆరు నెలల కాల వ్యవధికి అప్పటి జిల్లా కలెక్టర్ అభ్యర్థన మేరకు దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ తాత్కాలిక వసతి కోసం సీఆర్‌పీఎఫ్‌కు స్థలాన్ని కేటాయించారన్నారు. అంతకుముందు వరకు ఆ స్థలంలో అనేక శుభకార్యాలు, రాజకీయ, సాంఘిక సమావేశాలు జరిగేవని, దీనివల్ల దేవస్థానానికి అద్దె రూపంలో వేలాది రూపాయలు వచ్చేదని చెప్పారు. సీఆర్‌పీఎఫ్ నాటి నుంచి నేటి వరకు కనీస అద్దె చెల్లించకపోవడంతో దేవస్థానానికి ఇప్పటిరకు రూ. 7 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

భీమునిపట్నం (రూరల్), జనవరి 24 : స్థానిక అంబేడ్కర్ ఉన్నత పాఠశాల, చిట్టివలస బాలికల ఉన్నత పాఠశాలల్లో 175 మంది విద్యార్థినులకు ఎంఈఓ డి. శివరాణి బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. దివీస్ సంస్థ అందించిన నిధులతో జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ఈ పుస్తకాలను తయారు చేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వైజే స్వామి, ఉపాధ్యాయులు, దివీస్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్ పేదల పక్షపాతి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

కొమ్మాది, జనవరి 24 : ముఖ్యమంత్రి జగన్ పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన పీఎంపాలెం అవంతి ఫంక్షన్ హాల్‌లో ఆసరా నాలుగో విడత చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 79 లక్షల మందికి డ్వాక్రా సంఘాల ద్వారా ఆర్థిక సహాయం అందించినట్టు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక, జోన్-2 జడ్సీ కనకమహాలక్ష్మి, 5 6 వార్డుల అధ్యక్షులు బొట్టా అప్పలరాజు, పోతిన హనుమంతు, పోతిన ఎల్లాజీ, పిళ్లా రమణ, గుంటబోయిన సంజీవ్, పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, బగాది లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

ఆనందపురం, జనవరి 24 : మండలంలోని గంభీరం పంచాయతీ పరిధిలోని రవాణా శాఖ కార్యాలయం సముదాయంలో ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణాశాఖ కార్యాలయానికి వచ్చే వాహనదారుల సౌకర్యార్థం ప్లాంట్ నిర్మాణానికి దివీస్ సంస్థ ముందుకు వచ్చిందన్నారు. రెండు నెలల్లో పనులు పూర్తవుతాయని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్‌రావు, రాజారావు, మాధవి, శిరీషాదేవి, దివీస్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి),

● **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)

● **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24,టమాటా 24, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 46, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 38, బీరకాయలు 48, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 16, క్యారేట్ 22, దొండకాయలు 22, బంగాళా దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 120, బరబటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 68, గోరుచిక్కుడు 38, దోస కాయలు 34, వె ల్లుల్లి (పెద్దవి) 250, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 40 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 24 , కంద 54, దేముడు చిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

బీసీలపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

- టీడీపీ నాయకుడు ఎం. శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు
- పెదవాల్తేరులో జయహో బీసీ సభ



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలతో శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, జనవరి 24 : బీసీలపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని టీడీపీ నాయకుడు ఎం. శ్రీభరత్ అన్నారు. బుధవారం పెదవాల్తేరు గాంధీ బొమ్మ సెంటర్‌లో జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం వంద కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చిందన్నారు. నాలుగున్నరేళ్లుగా బీసీలకు ఎటువంటి వ్యక్తిగత రుణాలు, పథకాలు అమలు చేయలేదని, బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని చెప్పారు. ఎమ్మెల్యే వెలగపూడి రామ కృష్ణబాబు మాట్లాడుతూ పార్టీకి బీసీలు వెన్నుముక అని, ఉత్తరాంధ్ర నుంచి బీసీ నాయకుడు ఎర్రన్నాయుడుని కేంద్ర మంత్రి చేసిన ఘనత, దళిత మహిళ ప్రతిభాభారతిని స్పీకర్ చేసిన ఘనత టీడీపీకే దక్కు తుందని చెప్పారు. అనంతరం 19వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరగా వారికి కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్, బొట్టా వెంకటరమణ, పడల రమణ, కార్పొరేటర్లు గొలగాని మంగవేణి పోలరావు, నొల్లి నూకరత్న, రామలక్ష్మి, వార్డు అధ్యక్షులు బైరెడ్డి పోతన్నరెడ్డి, కాళ్ల శంకర్, పీతల అవినాష్, నక్క కనకరాజు, ఒమ్మి అప్పలరాజు, ఒమ్మి పోలరావు, ఎస్. సత్తిబాబు, రామచంద్ర పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

వైసీపీ బీసీల వ్యతిరేకి : కోరాడ రాజబాబు

ఆనందపురం : బీసీ కులాలకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని టీడీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి కోరాడ రాజబాబు అన్నారు. వేములవలస జంక్షన్‌లో జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో బీసీ లకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చామని, వైసీపీ పాలనలో అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బీసీలను నిర్లక్ష్యం చేసిన వైపీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం వేములవలస కూడలి నుంచి పెద్దిపాలెం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్, విశాఖ పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మీసాల సత్యన్నారాయణ, తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగ్రెడ్డి రమేష్, నాయకులు తమ్మిన విజయ్‌కుమార్, బుద్ద త్రినాథ్, ఎర్నాకుల జగదీశ్వరరావు, అంగటి రాము, వానపల్లి సత్య, పడాల అప్పలనాయుడు, బొద్దపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తీరంలో విద్యుత్ స్తంభాల తొలగింపు



సీతకొండ తీరంలో తొలగించిన స్తంభాలు

విశాలాక్షినగర్, జనవరి 24 : తాబేళ్ల సంరక్షణ నిమిత్తం తీరంలో వెలుగులు ఇస్తున్న విద్యుత్ స్తంభాలను జీవీఎంసీ సిబ్బంది బుధవారం తొలగించారు. తీరంలో ఏటా వేల సంఖ్యలో తాబేళ్లు గుడ్లు పెడతాయి. వాటి సంరక్షణకు అటవీ శాఖ అనేక చర్యలు చేపడుతుంది.నగరంలో జరిగిన జీ-20 సదస్సుల నేపథ్యంలో తీరంలో విద్యుత్ వెలుగులు విరజిమ్మేలా విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీలు అమర్చారు. లైట్ల వెలుగులు వల్ల తాబేళ్లు గుడ్లు పెట్టడానికి తీరానికి రావడం లేదని గమనించి స్తంభాలను తొలగించారు. ఆర్కే బీచ్ నుంచి జోడుగుళ్లపాలెం తీరం, వ్యూపాయింట్ ప్రాంతంలోని తీరంతో పాటు సాగర్‌నగర్ బీచ్, ఇస్కాన్ బీచ్‌లో ఉన్న స్తంభాలకు విద్యుత్ కట్ చేసి, వాటిని తొలగించారు.

'ఫుడ్ సెక్యూరిటీ ఇన్ ఇండియా' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రవిబాబు, వీసీ ప్రసాదరెడ్డి

వెంకోజీపాలెం, జనవరి 24 : ఏయూలోని వీసీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కె. రవిబాబు వీసీ ప్రసాదరెడ్డితో కలిసి బుధవారం ఫుడ్ సెక్యూరిటీ ఇన్ ఇండియా - ఇష్యూష్ అండ్ చాలెంజెస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ఏయూ సెంటర్ ఫర్ సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇంక్లూజివ్ పాలసీ స్టడీస్ సంచాలకుడు డాక్టర్ పి. సుబ్బారావు సంపాదకత్వం వహించారు. పుస్తకంలో 24 మంది రచయితలు ఇటీవల నిర్వహించిన రెండు రోజుల సదస్సులో సమర్పించిన పరిశోధన పత్రాలను పుస్తక రూపంలో తీసుకువచ్చారు. దేశంలో ఆహార భద్రత, కోవిడ్ తరువాత పరిస్థితులు, గిరిజన ప్రజల్లో ఆహార భద్రత, అంతర్జాతీయ సంస్థల పాత్ర, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన సమూహాలపై ఆహార అభద్రత ప్రభావం తదితర అంశాలను పుస్తకంలో పరిశోధనలు చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఎస్ఇఈసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

విశాలాక్షినగర్, జవనరి 24 : జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని విశాలాక్షినగర్ నుంచి సీతకొండ వ్యూపాయింట్ వైపు వెళ్లే బీచ్ రోడ్డులో బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. విశాలాక్షినగర్ మలుపు దాటి బీచ్ రోడ్డులో అతివేగంతో బైక్‌పై వస్తున్న వ్యక్తి రోడ్డుకి ఎడమ వైపు ఉన్న డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. అతను ఏయూ సెక్యూరిటీ గార్డుగా స్థానికులు గుర్తించారు. పూటుగా మద్యం సేవించి ఉండడంతో ప్రమాదం బారిన పడ్డాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


క్రీడలతో శారీరక ఉల్లాసం : ఎంపీపీ

ఆనందపురం, జనవరి 24 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక అన్నారు. తర్లువాడలో మజ్జి అప్పారావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. కాగా పోటీల్లో 55 జట్లు పాల్గొంటున్నాయని మొదటి బహుమతి కింద రూ. 25 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ. 15 వేలు అందజేస్తామని నిర్వాహకుడు మజ్జి వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, బంక్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి

ఆనందపురం. జనవరి 24 : ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ కిషాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి డిమాండ్ చేశారు. బుధవారం వేములవలస గ్రామంలో జిల్లా కిషాన్ మోర్చ అధ్యక్షుడు ప్రసాదరావు పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లా డారు. రైతులు పండించిన పంటను వారే అమ్ముకునేలా చర్యలు చేపట్టాన్నారు. అనంతరం స్థానిక రైతు బజారులో రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాదరావు పట్నాయక్, పాకలపాటి రవిరాజు, పి. రామచంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

సంతపేట కొత్తమ్మవారికి పూల అలంకరణ



తగరపువలస, జనవరి 24 : సంతపేట వద్ద ఉన్న కొత్తమ్మతల్లి అమ్మవారిని బుధవారం ఐదు రకాల చామంతి పూలతో అలంకరించారు. ఆలయంలో ప్రతి వారం ఒక్కో అలంకారంతో అమ్మవారిని తయారు చేస్తారు. ఈ వారం ఐదు రకాల చామంతి పూలతో అలంకరించారు. మొక్క అప్పలరెడ్డి, వెంకటలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో ఈ అలంకరణ చేశామని నిర్వాహకులు చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జనవరి 24 :విమ్స్ విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రెవెన్యూ కాలనీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చలపతి నగర్, వెటర్నరీ కాలనీ, కైలాసగిరి, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మద్దిలపాలెంలో...

విశాఖపట్నం : మద్దిపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని మద్దిలపాలెం సెక్షన్‌లో నిర్వహణ పనుల దృష్ట్యా గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు మద్దిలపాలెం, కృష్ణాకాలేజీ రోడ్డు, భానునగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

గురుకుల ప్రిన్సిపాల్‌కు సన్మానం

ఆరిలోవ, జనవరి 24 : శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గరుకులం పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రత్నవల్లిని పాఠశాల పూర్వ విద్యార్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాలల విశాఖ, అనకాపల్లి జిల్లాల సమన్వయకర్త రూపవతి, స్వాగా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు కైలాస్, రాజు. కార్యదర్శి కె. సంతోష్, కె. అప్పారావు పాల్గొన్నారు.


యూజీసీ నెట్‌లో చిట్టివలస ఉపాధ్యాయుడి ప్రతిభ

తగరపువలస, జనవరి 24 : చిట్టివలసలోని కొత్తపేటకు చెందిన ముగడాల అప్పలరాజుకు యూజీసీ నెట్ పరీక్షలో ప్రథమ స్థానం లభించింది. యూనివర్సిటీ గ్రాంట్సు కమిషన్ జాతీయ స్థాయిలో గత నెల నిర్వహించిన ఈ పరీక్షల్లో అప్పలరాజు 300 మార్కులకు 238 సాధించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత వల్ల విద్యా సంబంధమైన ఉద్యోగాలకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఆయన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా మజ్జిపేట హైస్కూల్లో పనిచేస్తున్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త దానయ్యశెట్టి కన్నుమూత

భీమునిపట్నం, జనవరి 24 : పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త విజ్జపు దానయ్యశెట్టి అలియాస్ నానాజీ (73) బుధవారం ఉదయం ఆయన స్వగృహంలో కన్నుమూశారు. రెండు వారాలుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. పట్టణంలోని పలువురు ఆయన భౌతికాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాయంత్రం బీచ్‌రోడ్‌లో వున్న శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి. కాగా అతనికి భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

తప్పులతడకగా ఓటర్ల జాబితా



జాబితాలో మృతి చెందిన వ్యక్తి పేరు

కొమ్మాది, జనవరి 24 : ఓటర్ల తుది జాబితాలోనూ తప్పులు దొర్లాయి. గతంలో విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో ఉన్న మృతులు, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయినవారు, నకిలీ డోర్ నంబరు ఉన్న వారి పేర్లు తొలగించి తుది జాబితా విడుదల చేశామని అధికారులు చెబుతున్నా.. ఆ దాఖలాలు లేవు. జోన్-2 6వ వార్డులోని పోలింగ్ కేంద్రాల్లో జాబితాను పరిశీలించగా మళ్లీ తప్పులు దొర్లిన విషయం వెలుగులోకి వచ్చింది. 261 బూత్‌లో మొత్తం ఓటర్లు 1065 మంది కాగా అందులో 15 మంది మృతులు ఉన్నారు. 262 బూత్‌లో మొత్తం ఓటర్లు 885 మంది కాగా 12 మంది మృతులు ఉన్నారు. 263 కేంద్రంలో మొత్తం ఓటర్లు 1100 మంది కాగా మృతి చెందిన వారి వివరాలు లెక్కిస్తున్నారు. కేవలం మూడు కేంద్రాల్లోనే ఇన్ని మృతి చెందిన ఓట్లు ఉంటే మిగిలిన చోట్ల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

పద్మనాభంలో 41775 మంది ఓటర్లు

పద్మనాభం, జనవరి 24 : ఓటర్ల తుది జాబితా ప్రకటించిన తరువాత మండలంలోని 45 పోలింగు కేంద్రాల్లో 41775 మంది ఓటర్లగా నమోదయ్యారని తహసీల్దారు కె. వేణుగోపాలరావు చెప్పారు వీరిలో పురుషులు 20424 మంది, మహిళలు 21351 మంది ఉన్నారన్నారు. ఈసారి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి వెయ్యి మంది పురుషులకు 1045 మంది మహిళలు సరాసరిన ఉన్నారు.

నూతన ఆవిష్కరణలతో ఉజ్వల భవిష్యత్తు

ఆనందపురం, జనవరి 24 :విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ముందుకు వస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఏయూ ఇన్నోవేషన్ సీఈఓ రవి ఈశ్వరరావు అన్నారు. శొంఠ్యాం సమీపంలో ఉన్న ఎన్ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ అండ్ ఇండస్ట్రీ 4.0ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న రోజులకు అనుగుణంగా విద్యా బోధన జరగాలన్నారు. ప్రస్తుతం ప్రతి అంశాన్ని ప్రాక్టికల్‌గా ట్రైనింగ్ ఇవ్వడం విద్యార్థులకు చాలా అవసరమన్నారు. ఆటువంటి అవకాశాలను కల్పిస్తున్న ఎన్ఎస్ఆర్ఐటీ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ప్రసాదరాజు, సెక్రటరీ ప్రసాదరాజు, ప్రిన్సిపాల్ ఎస్. శంభుప్రసాద్, డైరెక్టర్ రాజా మురుగుదాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



ఏయూ పాఠశాలలో బాలికా దినోత్సవం వేడుకలు

భీమునిపట్నం, జనవరి 24 : బాలికలు కృషి, పట్టుదలతో లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. బుధవారం భీమిలిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఉమెన్ వెల్ఫేర్ ప్రాజెక్టు చైల్డ్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ప్రభుత్వం అందిస్తోన్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఈఓ ఎల్. చంద్రకళ మాట్లాడుతూ తన కుటుంబ నేపథ్యాన్ని వివరిస్తూ, బాగా చదువుకోవడం వల్లే తాను ఈరోజున ఉన్నత స్థాయిలో ఉన్నానని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డి. వెంకటేశ్వరి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారిణి కలేసా బేగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు వెంకటలక్ష్మి, సూర్యనారాయణ, ఏపీసీ శ్రీనివాసరావు, భీమిలి ఐసీడీఎస్ సీడీపీఓ ఎం. శ్రీదేవి, విద్యాలయం ప్రిన్సిపాల్ కుమారి గంగ పాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రాధాన్యం : వీసీ

వెంకోజీపాలెం : ఏయూ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి వర్చువల్ విధానంలో మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయం బాలికా విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో మహిళా విద్యను ప్రోత్సహించడం, ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య అందించడం లక్ష్యంగా నాలుగున్నరేళ్లగా పని చేస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు, సమాజం గర్వించే స్థాయికి బాలికలు ఎదగాలన్నారు. అంతకుముందు దుర్గాబాయి దేశముఖ్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలు ఆచార్య ఏ. పల్లవి, సిబ్బంది డాక్టర్ పి. ఉష, ఏయూ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుధారాణి, పాల్గొన్నారు.

పద్మనాభంలో...

పద్మనాభం : పద్మనాభం కేజీబీవీలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ మాట్లాడుతూ బాలికలు చక్కని విద్యాభ్యాసంతో అవకాశాలను మలచుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ఈమేరకు పలువురు మహిళా మణుల జీవిత విశేషాలను వివరించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ చంద్రకళ

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు : డీఈఓ

భీమునిపట్నం (రూరల్), జనవరి 24 : ఈఏడాది పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని డీఈఓ ఎల్. చంద్రకళ తెలిపారు. బుధవారం ఆమె దాకమర్రి జడ్పీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఫైనల్ పరీక్షలకు ముందుగానే ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. అలాగే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూర్యనారాయణరాజు, ఎంపీటీసీ సభ్యుడు నగేష్‌బాబు, సర్పంచ్ పైడప్పడు, తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సభకు తరలివెళ్లిన శ్రేణులు

ఎంవీపీ కాలనీ, జనవరి 24 : పెదవాల్తేరులో జరిగిన జయహో బీసీ సభకు 17వ వార్డు నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. ఆదర్శనగర్ నుంచి పెదవాల్తేరు వరకూ ఈ ర్యాలీ జరిగింది. జై తెలుగుదేశం, జయహో బీసీ వంటి నినాదాలతో సభా వేదిక వద్దకు వెళ్లారు.

ఘనంగా డ్రైవర్ల దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కణితి వెంకట్రావు

సింహాచలం, జనవరి 24 : అనునిత్యం వేలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న డ్రైవర్లకు ధన్యవాదాలు అని ఆర్టీసీ సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ అన్నారు. జాతీయ డ్రైవర్ల దినోత్సవం పురస్కరించుకుని సింహాచలం కాంప్లెక్స్‌లో బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జరిగిన కార్యక్రమంలో డ్రైవర్లను అభినందించారు. అనంతరం వారికి సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. అలాగే ఉత్తమ డ్రైవర్‌గా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన డిపో డ్రైవర్ ఎస్ఏఎన్ రాజును సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంటు డిపో మేనేజర్ సాయి, తులసీ, డిప్యూటీ సూపర్‌వైజర్ (మెకానిక్) కొండలరావు, ఎస్‌టీఐ కుమారి పాల్గొన్నారు.

మద్దిలపాలెం డిపోలో...

ద్వారకాబస్‌స్టేషన్ : పీటీడీ ప్రతిష్ట డ్రైవర్ల చేతుల్లోనే ఉందని పీటీడీ విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కణితి వెంకటరావు అన్నారు. పీటీడీ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మద్దిలపాలెం డిపోలో డ్రైవర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ అరుణకుమారి, ట్రాఫిక్ మేనేజర్లు మణిమాధురి, అశ్విని, గ్యారేజీ సూపర్‌వైజర్ హిమ బిందు, సెక్యూరిటీ ఇన్‌చార్జి ఎల్. శేఖర్ పాల్గొన్నారు.

వారాంతపు సంత ఆశీలు వసూలుకు వేలం

కొమ్మాది, జనవరి 24 : జోన్-2 కార్యాలయంలో జడ్సీ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం మధురవాడ రోజు వారీ మార్కెట్, శనివారం వారాంతపు సంతలో వర్తకుల నుంచి ఆశీలు వసూలుకు బుధవారం వేలం నిర్వహించారు. ముగ్గురు పాల్గొనగా రూ. 22.6 లక్షలకు పతివాడ గోపాలరావు పాట దక్కించుకున్నారు. అలాగే ముడసర్లోవ ప్రవేశ రుసుము వసూలుకు రూ. 6 లక్షలకు కె. రామ్ ప్రసాదు, ముడసర్లోవ పార్కింగ్ కోసం రూ. 1.35 లక్షలకు వి. శ్రీనివాసరావు, క్యాంటీన్ నిర్వహణకు రూ. 62 వేలకు వి. శ్రీనివాసరావుకు వేలం ఖరాయినట్టు జడ్సీ తెలిపారు. మధురవాడ మిథిలాపురి ఉడా కాలనీ, ముడసర్లోవ వద్ద మామిడి, కొబ్బరి చెట్ల ఫలసాయం, మదురవాడలోని వీవీ నరసింహారావు కల్యాణం మండపం, ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద కల్యాణ మండపం, మారికవలస రాజీవ్ గృహకల్ప కల్యాణ మండపం లీజుకు కూడా వేలం నిర్వహించగా పాటదారులు రాకపోవడంతో వాయిదా వేశారు.

రోడ్డు మార్జిన్ ఆశీలు వసూలు వేలం వాయిదా..

భీమునిపట్నం : భీమిలి జోనల్ కార్యాలయంలో రోడ్డు మార్జిన్ ఆశీలు వసూలుకు బుధవారం నిర్వహించాల్సిన వేలం వాయిదా వేసినట్టు జడ్సీ రాము తెలిపారు. భీమిలి, తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లో ఆశీలు వసూలుకు ఈ వేలం ఆహ్వానించారు. తగరపువలస నుంచి ఒక్కరు మాత్రమే హాజరయ్యారు. దీంతో వేలం వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

ఇళ్ల వద్దే నేత్ర వైద్య పరీక్షలు

ఆరిలోవ, జనవరి 24 : కంటి పరీక్షల కోసం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు రాలేని వారికి ఇంటి వద్దే పరీక్షలు చేయనున్నట్టు ఎల్‌వీ ప్రసద్ కంటి ఆస్పత్రి వైద్యులు తెలిపారు. స్నేహ సంఖ్య ఏజికేర్ సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. నగరానికి 20 కిలోమీటర్ల పరిధిలో ఈ సేవలు అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు 63024 32118 సెల్ నంబర్‌ను సంప్రతించాలని వారు సూచించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, జనవరి 24 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి దేవస్థానం ఈఈగా పనిచేసిన దివంగత బి. మల్లేశ్వరరావు పేరిట అతని కుమార్తె బొప్పన వాణి రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,01,116 లను నగదు రూపంలో అన్నప్రసాద విభాగం ఏఈఓ పాలూరి నరసింగరావుకు బుధవారం ఆమె అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

'ఆడుదాం ఆంధ్రా' నియోజకవర్గ స్థాయి పోటీలు

భీమునిపట్నం, జనవరి 24 : గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఫుట్‌బాల్ మైదా నంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్, జోనల్ కమిషనరు బొడ్డేపల్లి రాము, ఎంపీడీవో జానకి, ఎంఈవో ఎం. శివరాణి, పాల్గొన్నారు.

సీఎం జగన్ కొత్త నాటకం : ప్రణవ్

ఎంవీపీ కాలనీ, జనవరి 24 : విద్యా వ్యవస్థను దోపిడీ వ్యవస్థగా మార్చేసిన ముఖ్యమంత్రి జగన్ కొత్త నాటకానికి తెర తీశారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో విమర్శించారు. నాలుగున్నరేళ్లగా విద్యార్థులను తప్పుదోవ పట్టించిన ముఖ్యమంత్రి తాజాగా తిరుపతిలో ఇండియా టుడే ఎడ్యుకేషన్ కాంక్లేవ్ పేరిట కొత్త నాటకానికి తెర తీశారన్నారు. దీనికి రూ. 4.20 కోట్లు చెల్లించేందుకు ఉత్తర్వులు జారీ చేశారని, విద్యా రంగంలో పథకాల పేరిట దోచుకుంటున్నారని విమర్శించారు.

17వ వార్డులో ఎంపీ ఎంవీవీ పాదయాత్ర

పెదవాల్తేరు, జనవరి 24 : వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని ఎంపీ, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ కోరారు. బుధవారం ఆయన 17వ వార్డు పెదవాల్తేరు, ఇందిరానగర్‌లో కార్పొరేటర్ గేదెల లావణ్య నాగరాజు ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైసీపీ పాలన కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బొడా శ్రీను, చొక్కర శేఖర్, కారే శ్రీలక్ష్మి, సత్యాల సాగారిక, వెంకట్, షకీన, తదితరులు పాల్గొన్నారు.

నేడు సంక్షిప్త రామాయణ హవనం

సింహాచలం, జనవరి 24 : సింహగిరిపై ఉన్న సీతారామస్వామి దేవాలయంలో రాముడి ఆవిర్భావ నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం సంక్షిప్త రామాయణ హవనం నిర్వహించనున్నట్టు ఈఓ శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభాతారాధనల తరువాత లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో ప్రత్యేక హవనం జరుపుతున్నామని చెప్పారు.

వీసీని అభినందించిన ప్రముఖులు

వెంకోజీపాలెం, జనవరి 24 : ఏయూ వీసీగా నియమితులైన ప్రసాదరెడ్డిని పలువురు ప్రముఖులు బుధవారం అభినందించారు. కిడ్స్ క్రియేట్ పాఠశాల విద్యార్థులు వీసీని కలిసి చిత్రాన్ని బహూకరించారు.అలాగే ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ కె. కుమార్ రాజా, డాక్టర్ మన్మోహన్, జాయింట్ సెక్రటరీ ఆకుల చంద్రశేఖర్ పుష్పగుచ్ఛం అందజేశారు.